www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 01 | శుక్రవారం,జూన్ 5 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## అమిత్ షాపై వివాదాస్పద వ్యాఖ్యలు..
### మమతా బెనర్జీపై కేసు నమోదు!



పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై సిలిగురి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, హోం మంత్రి అమిత్ షాపై ఆమె వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. జూన్ 2న కోల్‌కతాలో జరిగిన నిరసన సభలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ జాతీయుడు ఉస్మాన్ హాది

2లో..

## కార్మికులను ప్రభుత్వం మోసం చేసింది
**- హరీష్ రావు**



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను, కార్మికులను మోసం చేస్తోందని, ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టడం దారుణమని ఆరోపించారు. పటాన్‌చెరువు సిగాచి పరిశ్రమలో మరణించిన కార్మికుల కుటుంబాలకు పరిహారం విషయంలోనూ ప్రభుత్వం అన్యాయం చేసిందని దయ్యబట్టారు. జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, సింగరేణి కార్మికులను వంచించిందని, రెండేళ్లు గడుస్తున్నా పీఆర్సీ ప్రకటన లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు.




# అమీర్‌పేట్ కెఎస్సార్ ఫ్యాషన్స్‌లో
# భారీ అగ్నిప్రమాదం

- టౌన్ ప్లానింగ్ కక్కుర్తి.. 'స్టే'ల చాటున అక్రమ దందా!
- మైత్రివనం మెయిన్ రోడ్డుపై 'కెఎస్సార్ ఫ్యాషన్స్' బుగ్గిపాలు.. అమీర్‌పేట్ అతలాకుతలం
- రెసిడెన్షియల్ పర్మిషన్లతో కమర్షియల్ మాఫియా.. అదనపు ఫ్లోర్లలో 'మృత్యు' గోడౌన్లు
- 'హైడ్రా' బుల్డోజర్లకు 'లీగల్' బ్రేకులు.. కోర్టు లొసుగులతో అక్రమార్కుల ఆటలు!

**అమీర్‌పేట్ 'కెఎస్సార్ ఫ్యాషన్స్' అగ్నిప్రమాదం కేవలం ఒక యాదృచ్ఛిక విపత్తు కాదు; ఇప్పుడు టౌన్ ప్లానింగ్ పబ్లిక్ పోర్టల్ బిల్డ్ నౌ పారదర్శకత లోపం: అది టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి కక్కుర్తికి, అగ్నిమాపక శాఖ ఉదాసీనతకు నిదర్శనం. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ మాఫియా నడుపుతూ, అక్రమ అంతస్తుల్లో 'మృత్యు గోడౌన్లు' నిర్మించడం వ్యవస్థాగత నేరానికి పరాకాష్ట. 'హైడ్రా' కఠిన చర్యలు చేపడుతున్నా, కోర్టు లొసుగులు, మున్సిపల్ లాయర్ల లాలూచీ, 'ఇంటర్ స్టే' ఆర్డర్ల రక్షణ కవచంతో అక్రమార్కులు ప్రజల ప్రాణాలతో జూదమాడుతున్నారు. కేవలం లాభాపేక్ష-అవినీతి కలయికతో నడుస్తున్న ఈ క్లిష్టమైన 'లీగల్' సవాళ్లను అధిగమించి, వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే మరిన్ని అమాయక ప్రాణాలు బుగ్గిపాలు కాక తప్పదు.**

**(భారత శక్తి ప్రత్యేక పరిశోధనాత్మక ప్రతినిధి - హైదరాబాద్)**

నగరం నడిబొడ్డున మరో 'షాపింగ్ మృత్యుకూపం' బట్టబయలైంది. టౌన్ ప్లానింగ్ అధికారుల కక్కుర్తి, అగ్నిమాపక శాఖ ఉదాసీనత, కోర్టు 'స్టే'ల లొసుగులు కలిసి అమాయక ప్రజల ప్రాణాలతో ఎలా జూదం ఆడుతున్నాయో అమీర్‌పేట్ అగ్ని ప్రమాదం మరోసారి నిరూపించింది. అత్యంత రద్దీ ప్రాంతమైన శ్రీనివాసనగర్ వెస్ట్, మైత్రివనం మెయిన్ రోడ్డు పక్కనే.. మెట్రో పిల్లర్ నంబర్ A1043 సమీపంలో ఉన్న "కెఎస్సార్ ఫ్యాషన్స్" (KSR Fashions) మాల్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదం నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. వస్త్ర సామగ్రితో నిండిన ఆ బహుళ అంతస్తుల భవనంలో మంటలు క్షణాల్లో రెండో అంతస్తుకు, ఆపై పక్కనే ఉన్న వాణిజ్య దుకాణాలకు వ్యాపించాయి. దట్టమైన నల్లటి విషపొగతో అమీర్‌పేట్ అతలాకుతలమైంది, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. అయితే, ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదం కాదు.. ముమ్మాటికీ మున్సిపల్, అగ్నిమాపక శాఖల అవినీతి అండతో జరిగిన "వ్యవస్థాగత నేరం" దీనిపై 'భారత శక్తి' ఇన్వెస్టిగేటివ్ డెస్క్ జరిపిన క్షేత్రస్థాయి పరిశోధనలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి.

### 1.పర్మిషన్ ఒక దానికి.. దందా ఇంకోదానికి!

అమీర్‌పేట్, మైత్రివనం పరిసరాల్లోని వందలాది భవనాలలాగే ఈ ప్రమాదం జరిగిన భవనంలోనూ ప్రాథమిక నిబంధనలు గాలికి ఎగిరిపోయాయి.

### రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ దందా:

నివాస ప్రాంతాల పరిధిలో కేవలం ఇళ్లు నిర్మించుకుంటామని జీహెచ్ఎంసీ (GHMC) టౌన్ ప్లానింగ్ విభాగం నుండి అనుమతులు పొంది, వాటిని రాత్రికి రాత్రే భారీ షాపింగ్ మాల్స్‌గా, బట్టల గోడౌన్లుగా మార్చేస్తున్నారు. నివాస భవనాలకు వాడే కరెంట్ లైన్లపై.. ఇలాంటి భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఏసీలు, హై-వోల్టేజ్ లైటింగ్ పడటంతో తీవ్రమైన ఒత్తిడి (Overload) ఏర్పడి తీగలు వేడెక్కి షార్ట్ సర్క్యూట్లకు దారితీస్తోంది.

2లో..



## సరోగసీ కేంద్రాల నియంత్రణ..
### కేంద్రం అభిప్రాయాన్ని
# కోరిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ (భారత శక్తి)** పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.



## మక్తల్ నారాయణపేటలో
# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన

**నారాయణపేట(భారత శక్తి)** మక్తల్ నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ప్లాన్ మ్యాప్స్‌ను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పనులను పరిశీలించడానికి ఈరోజు బెంగుళూరు నుంచి నేరుగా నారాయణపేట జిల్లా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రి మొదటగా మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న పనులను వివరించే ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎత్తిపోతల ప్రాజెక్టు ప్యాకేజీ -1

2లో..

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను
# కలిసిన కేటీఆర్



**హైదరాబాద్ (భారత శక్తి)** చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

### అసలు కేసు నేపథ్యం ఏంటి?

సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

## ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యంగా
# రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు

**- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు - ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన**
**- రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు - సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 4788**
**- వాట్స్ యాప్ నెంబర్ 8247619983 - రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ**
**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణ పనులను గురువారం నాడు మంత్రి పరిశీలించారు. అంతకుముందు సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని మంత్రి స్పష్టంచేశారు.

2లో..



# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు..
## ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

- డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం - 2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన
- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు - గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు
- ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు



**న్యూఢిల్లీ (భారత శక్తి)** నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం.నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో

2లో..

## ఈ నెల 15 వరకు
# ధాన్యం కొనుగోళ్లు
**- మంత్రి ఉత్తమ్**




**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ నెల 15 వరకు ధాన్యం కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. యాసంగిలో ఇప్పటి వరకు 70.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

## ఈ నెల 8న ఇండియా
# కూటమి పక్షాల భేటీ



**హైదరాబాద్(భారత శక్తి)** వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం, కూటమిలో నెలకొన్న అభిప్రాయ భేదాల నేపథ్యంలో విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీలు 8 న ఢిల్లీలో భేటీ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వంపై ఉమ్మడి కార్యాచరణ ప్రకటించడం, ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయడం ఈ భేటీ ప్రధాన లక్ష్యాలు. ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, నిరుద్యోగం, పరీక్షా పత్రాల లీకేజీలు వంటి ప్రజా సమస్యలపై సంయుక్త పోరాటానికి వ్యూహాలు ఖరారు చేయనున్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## నై.. నై.. రుతుపవనాలు

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. నైరుతి రుతుపవన కాలం.జూన్ 1వ తేదీ వచ్చింది అంటే చాలు, కేరళ తీరాన్ని వర్షాలు పలకరిస్తాయి. తద్వారా దేశవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకుంటాయని అందరూ ఆశిస్తారు. అయితే 2026 సీజన్‌లో నైరుతి రుతుపవనాల రాక కోసం కొంత జాప్యం చోటు చేసుకుంది. ముందుగా అంచనా వేసినట్టుగా జూన్ 1న ఇవి కేరళను తాకలేకపోయాయి. వాతావరణ పరిస్థితుల అనుకూలించకపోవడంతో ఇవి ప్రస్తుతం ఉన్నచోటే స్తబ్ధుగా నిలిచిపోయాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకాల్సిన రుతుపవనాలు, ఈ సారి ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ప్రస్తుతం ఇవి మార్గమధ్యలో నిలిచిపోయాయని భారత్ వాతావరణ శాఖ, ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ ధ్రువీకరించాయి. రుతుపవనాల ద్రోణి కదలికలు మందగించడమే దీనికి ప్రధాన కారణం. పూర్తిగా వ్యవసాయిక దేశం అయిన భారత్ లో వర్షాలే ఆధారం. ఎంతలా అంటే దేశ జీడీపీని ప్రభావితం చేసేటంతలా. గ్రామీణ ప్రాంతాలు దేశంలో నూటికి డెబ్బై శాతం ఉన్నాయి. దాంతో దేశ జాతీయ స్థూల ఆదాయం వృద్ధి చెందాలీ అంటే గ్రామీణ భారతం పచ్చగా ఉండాలి. అది ఎపుడు సాధ్యపడుతుంది అంటే భారీగా సమాయనుకూలంగా వానలు పడి పంటలు పండినపుడు. దేశంలో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. కానీ దేశంలో అగ్రికల్చర్ ఇయర్ మాత్రం జూన్ లో స్టార్ట్ అవుతుంది. దానికి కారణం నైరుతు రుతు పవనాల రాక. ఈ రుతు పవనాలు ఎంత తొందరగా వస్తే అంత సంబరంగా ఏరువాక స్టార్ట్ అవుతుంది. దాంతో రైతాంగం సైతం సంబరాలు చేసుకుంటుంది. కానీ ఈసారి పరిస్థితి చూస్తే నైరుతి నై నై అంటోంది: సకాలంలో నైరుతి రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించడం అంటే మే నెలాఖరు అన్న మాట. ఈ మేరకు భారత వాతావరణ విభాగం ఐఎండీ అయితే మొదట చెప్పింది మే 26న నైరుతి దేశంలో ఎంట్రీ ఇస్తుందని. కానీ ఆ డేట్ తప్పింది. ఆ తరువాత మే 30, 31 తేదీలు అన్నా కూడా అదీ జరగలేదు. జూన్ 1 లేదా 3 అని చెప్పినా ఇపుడు ఆ డేటూ మారింది. లేటెస్ట్ డేట్ ఏంటి అంటే జూన్ 8 తరువాత అని అంటున్నారు. అయితే అది కూడా అంత కన్ ఫర్మ్ అవునా కాదా అన్నది ఒక పెద్ద డౌట్. మరో వైపు చూస్తే ఈసారి నైరుతి ఆగమనం లేట్ అయినా వానలు కూడా చాలా తక్కువ పడతాయని దానికి కారణం నైరుతి బలహీనంగా ఉందని. ఈ వార్తలు అయితే రైతాంగాన్ని కాదు దేశ ఆర్థిక నిపుణులను కూడా షాక్ కి గురి చేస్తున్నాయి. ఈసారి వానలు తక్కువ పడితే ఆ ప్రతికూల పరిస్థితి ఎలా ఉంటుంది అనే అంతా ఆలోచిస్తున్నారు. ఈసారి తేలిక పాటి వానలే పడతాయంటే వ్యవసాయం సంగతి ఏమిటి అన్నది కూడా మరో చింతగా మారుతోంది. భారత్ లో నైరుతి ఎంట్రీకి గేట్ వే కేరళం రాష్ట్రం. అక్కడ నుంచే మెల్లగా దేశంలోకి ప్రవేశించి మొత్తం దేశమంతా కొద్ది కాలంలోనే సర్దుకుని భారీ వానలు కురుస్తాయి. అలా వర్షాకాలం సీజన్ స్టార్ట్ అయి సెప్టెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం కేరళంలో కొన్ని ప్రంతాలలో వర్షాలు పడుతున్నాయి కానీ నైరుతి ఆరంభ సూచిన అది కాదని ఐఎండీ చెబుతోంది. నైరుతి రాకను గుర్తించాలంటే కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. కేరళంలోని ఈ సీజన్ లో ఏకంగా అరవై శాతం పైగా వానలు పడితే నైరుతి ఎంటర్ అయినట్లుగా భావిస్తారు. అలాగే అరేబియా సముద్రం నుంచి పశ్చిమ దిశగా వీచే గాలులు ఆ నిర్దిష్ట వేగాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ మీదట ఆయా ప్రాంతమంతా తగినన్ని మేఘాలు విస్తరించి ఉండాలి. ఇవన్నీ నైరుతి రుతు పవనాల ఆగమాన్ని సూచిస్తాయి. ప్రస్తుతం అయితే కేరళం రాష్ట్రంలో కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి. మేఘాలు విస్తరించి కూడా ఉన్నాయి. కానీ అసలైన ప్రమాణం అయిన అరేబియా సముద్రం నుంచి గాలులు వీయడం లేదని ఐఎండీ సైంటిస్టు చెబుతున్నారు . ఈ మూడు ఒకేసారి కలసి ఉంటేనే నైరుతి పవనాల సీజన్ స్టార్ట్ అయినట్లు. అపుడు వర్షాకాలం వచ్చినట్లుగా చెబుతారు. ఇక ఈసారి పూర్తి స్థాయి వానలు కురిసే అవకాశాలు కూడా తక్కువ అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దానికి ఎల్ నినో ప్రభావం కారణం అని స్పష్టం చేస్తున్నారు. దాని వల్ల గత ఏడాది కంటే ఈసారి తక్కువ వానలు పడతాయని వాటితోనే సర్దుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. నైరుతి రుతు పవనాలు ఆలస్యమైనా లేదా ఎంట్రీ ఇచ్చినా బలహీనం కావడం వెనక ఎల్ నినో ప్రభావం గట్టిగా ఉంటుందని అంటున్నారు. ఈ విధంగా వర్షాభావ పరిస్థితులు కనుక ఉంటే ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మీద కూడా పెను ప్రభావం చూపిస్తుందని అంటున్నారు.ఈ జాప్యాన్ని ప్రధాన కారణం ఏంటంటే... అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే. ఈ రెండు కూడా రుతుపవనాల పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయి. పశ్చిమ దిశ నుంచి వీచే గాలులు రుతుపవనాలను కేరళ తీరం వైపు నెట్టడంలో సహాయపడాలి కానీ ప్రస్తుతం గాలి దిశ, వేగం ఇందుకు అనుకూలంగా లేవు. అయితే ఈ ఆలస్యానికి రాబోయే ఎల్‌నినో ప్రభావానికి ఎలాంటి సంబంధం లేదని స్కైమెట్ వాతావరణ, వాతావరణ మార్పుల విభాగంలో వైస్ ప్రెసిడెంట్ మహేష్ స్పష్టం చేశారు. రుతుపవనాలు కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటాయని ఆయన వివరించారు. కేరళలోని రుతుపవనాలు ప్రవేశించాయని చెప్పడానికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. అవి పూర్తి అయితేనే అధికారికంగా రుతుపవనాల రాకను ప్రకటిస్తారు. కేరళ, కర్ణాటక, లక్షద్వీప్‌లోని సుమారు 60 శాతం వాతావరణ కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు కనీసం 2.5 మి.మి. వర్షపాతం నమోదు కావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పరిమితి ఇంకా నెరవేరలేదు. అందుకే అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతానికి రుతుపవనాలు ఆగిపోయినప్పటికీ , ఆశాజనకమైన వార్త కూడా ఉంది. స్కైమెట్ అంచనాల ప్రకారం రాబోయే గురువారం లేదా శుక్రవారం నాటికి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉంది. వచ్చే 3-4 రోజుల్లో అరేబియా సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, బంగళాఖాతంలోని మెజారిటీ ప్రాంతాలు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు ఇవి విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న ఐఎండీ త్వరలోనే రుతుపవనాల రాకపై సవరించిన తేదీని ప్రకటించే అవకాశం ఉంది. భారత్‌లో రుతుపవనాలకు కేరళ ప్రవేశ ద్వార లాంటిది. ఇక్కడికి రుతుపవనాలు చేరిన తర్వాతే దేశవ్యాప్తంగా వర్షాలు విస్తరిస్తాయి. వర్షాలపైనే దేశంలోని సుమారు 70 శాతం సాగు భూమి ఆధారపడి ఉంది. రుతుపవనాలు ఆలస్యమైతే విత్తనాలు వేయడం ఆలస్యమవుతుంది. అది ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది. అయితే కొన్ని రోజుల జాప్యం సర్వసాధారణమేనని, రుతుపవనాలు పుంజుకుంటే ఆ తర్వాత వర్షపాతం సాధారణంగానే ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## మామిడిపల్లిలో యువతి అదృశ్యం.

**-కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఏఎస్ఐ తిరుమల బాబు.**

**-యువతి ఆచూకీ తెలిస్తే కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించాలి.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 4: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన పల్లి పావని (25) అనే యువతి అదృశ్యమైనట్లు ఏఎస్సై తిరుమలబాబు తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం.. పావని సోమవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సిరిసిల్ల వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. రాత్రయినా ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి నరసయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తిరుమల బాబు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన TUWJ సంఘం సభ్యులు.



జనగామ(భారత శక్తి)జూన్ 4: జర్నలిస్టులపై ఇంటలిజెన్స్ పోలీసులతో విచారణ చేయిస్తున్న జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ నేతృత్వంలో కలిసిన బృందం జర్నలిస్టులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న కలెక్టర్ ఆగడాలను మంత్రి దృష్టికి ఈ సందర్భంగా తీసుకెళ్లారు.గతంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో సైతం కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన డెక్కన్ క్రానికల్,ఇండియన్ ఎక్స్ప్రెస్, రిపోర్టర్లకు జి ఓ 252 కు వ్యతిరేకంగా స్థానం కల్పించడం వివాదాస్పదంగా మారిన విషయాన్ని సైతం మంత్రికి వివరించారు.ప్రస్తుతం జిల్లాలో 288 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీకాగా అందులో 180 మంది జర్నలిస్టులను ప్రత్యేకంగా గుర్తించి వారిపై ఇంటలిజెన్స్ పోలీస్ అధికారుల చేత విచారణ చేయిస్తున్న కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టుల వాహనాలను సైతం కలెక్టర్ కార్యాలయంలోకి అనుమతించకుండా ఆదేశాలు జారీ చేసి అమలుపరుస్తున్న విషయాన్ని సైతం మంత్రికి వివరించారు.అదేవిధంగా సూర్య పేపర్ తో సహా మరో ఎనిమిది దినపత్రికలను సబ్ కమిటీల నేతృత్వంలో పరిశీలన జరిపి నివేదిక ఇవ్వగా దానికి విరుద్ధంగా మీడియా అకాడమీ చైర్మన్ వ్యవహరిస్తున్న తీరును సైతం మంత్రి దృష్టికి ఈ సందర్భంగా తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన మంత్రి వెంటనే కలెక్టర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.దాంతో పాటు తొమ్మిది పత్రికల విషయంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో చర్చిస్తామన్నారు.మంత్రిని కలిసినవారు టియుడబ్ల్యుగా రాష్ట్ర కోశాధికారి యోగానందం, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ నవీన్ కుమార్ యారా, ఐజెయు నాయకులు అవ్వారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


## మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

**-కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మంచిర్యాల జిల్లా అభివృద్ధి**

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 4 (భారతశక్తి): కేంద్ర క్యాబిట్ సమావేశంలో 63 జాతీయ రహదారి ఆర్మూర్- మంచిర్యాల మధ్య 5203 కోట్ల రూపాయలతో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు తెలుపుతూ గురువారం రోజున బీజేపీ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో మంచిర్యాల జిల్లా అభివృద్ధి చెందుతుంది అని తెలిపారు.మెరుగైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ జిల్లా ప్రజలకు అందించడానికి మోదీ ప్రభుత్వం జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లు వేల కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి వేగంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఉత్తర మరియు దక్షిణ భారత దేశానికి మెరుగైన మరియు వేగవంతమైన రోడ్డు సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో గతంలో నాగపూర్ విజయవాడ కారిడార్ లో భాగంగా చందాపూర్-మంచిర్యాల జాతీయ రహదారి363 పూర్తి అయిందని, మంచిర్యాల విజయవాడ మధ్య జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ఆర్మూర్ - మంచిర్యాల 63 జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర కాబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం, పారిశ్రామిక అభివృద్ధి, సరుకు రవాణా కోసం మోదీ ప్రభుత్వం జాతీయ రహదారుల విస్తరణ చేపట్టి దేశంలోని జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ నేను జాతీయ రహదారి తెచ్చానని గొప్పలు చెప్పుకోవడం తప్ప జాతీయ రహదారి కోసం ఏనాడు కూడా కృషి చేయలేదని అన్నారు.జిల్లా బీజేపీ నాయకులు అనేక సార్లు కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీని జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగింది అని తెలిపారు. బీజేపీ నాయకుల కృషి వల్లనే జిల్లాకు జాతీయ రహదారులు, అమృత్ భారత్ రైల్వే స్టేషన్ మరియు వందే భారత్ రైలు వచ్చిందే తప్ప ఇందులో ఎంపీ కృషి ఏమాత్రం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, సంజీవ్ రావు, బంగారు వేణు గోపాల్, అక్కల రమేష్, మల్యాల రాజమల్లు, ముదాం మల్లేష్, కుర్రె చక్రవర్తి, సత్రం రమేష్, ధన్ సింగ్, బేరా రామన్న యాదవ్, సప్పిడి నరేష్, బూర రాజశేఖర్ తతిదరులు పాల్గొన్నారు

## మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీశ్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జనగామ ఎమ్మెల్యే డాక్టర్: పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ(భారత శక్తి)జూన్ 4: మాజీ మంత్రి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు తన్నీరు హరీష్ రావు జన్మదినోత్సవం సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిన్న పుట్టినరోజు సందర్బంగా ఈరోజు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హరీశ్ రావు గారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. అలాగే తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం హరీశ్ రావు అందిస్తున్న సేవలు మరింత కొనసాగాలని అభినందనలు తెలిపారు.

## పోలింగ్ బూత్ స్థాయిలో బీజేపీ ని పటిష్టం చేద్దాం

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ ఎడ్ల రమేష్**




అమీన్ పూర్ జూన్ 4 భారత శక్తి బీజేపీ పార్టీని పోలింగ్ బూత్ స్థాయిలో పటిష్టం చేసి ఎశ్రీఖ 2 ను వ్యవస్థను పటిష్టం చేసి బీజేపీ ని వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ ఎడ్ల రమేష్ పేర్కొన్నారు. గురువారం బీరంగూడ లో జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం అమీన్ పూర్ పట్టణ కన్వినర్ ఆగరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశం లో వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమలు పెద్ద ఎత్తున ప్రజలకు తెలిపి బీజేపీ పట్ల అభిమానం చాటే విదంగా కార్యక్రమం రూపొందుంచికొని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. బీజేపీ ని ఆధారంచడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని దీ=ా కాంగ్రెస్ పట్ల తీవ్ర వ్యతిరేక త ఉందని స్త్రష్టఎష ఎన్నికల్లో బీజేపీ గెలుపు ద్యేయంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు.ఈసందర్బంగా శక్తి కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టణ కన్వీనర్ గా ఆగరెడ్డి కో కన్వినర్ గా లక్ష్మణ్ గుప్త ప్రధాన కార్యదర్శిగా కొత్త పల్లి రమేష్ ను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ బీజేపీ కన్విినర్ ఆగరెడ్డి కో కన్విినర్ లక్ష్మణ్ గుప్తా ప్రధాన కార్యదర్శులు రమేష్ రమేష్ రెడ్డి శ్రవణ్ మహిళమోర్చ ప్రధాన కార్యదర్శి తులసి గోపి గోపాల్ మహేష్ వీరేశం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**తెల్లాపూర్ లో 87 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**




తెల్లాపూర్ జూన్ 4 భారత శక్తి పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 9 డివిజన్ల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ.. మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలో గల హుడా కమాన్ నుండి రేడియం రోడ్డు వరకు గల ప్రధాన రహదారి మీడియన్, పాత్ వే కోసం 87 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఉదయం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని కోరుతూ ఇటీవల సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ను సైతం కలిసి విన్నవించడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో ప్రతి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు కాబోతున్నాయని తెలిపారు. శరవేగంగా ఏర్పడుతున్న నూతన కాలనీలలో సైతం మౌలిక వసతులు కల్పనకు నిధులు కేటాయించబోతున్నట్లు తెలిపారు. తెల్లాపూర్ పరిధిలో.. వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు లచ్చి రామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, శ్రీకాంత్, ఉమేష్, రవీందర్ రెడ్డి, నాగరాజు, బల్దియా ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణి, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..



పటాన్‌చెరు జూన్ 4 భారత శక్తి తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు పుట్టిన రోజు సందర్భంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆయనకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం హైదరాబాద్ లోని హరీష్ రావు నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే జిఎంఆర్..ఆయనకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. హరీష్ రావు పరిపూర్ణ ఆరోగ్యంతో, చిరకాలం ప్రజా సేవలో ఉండాలని ఆయన అభిలషించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమం నుండి వృద్ధుడు అదృశ్యం



ఎల్బీనగర్, జూన్ 04 (భారత శక్తి): నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధుడు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఆల్మాస్‌గూడలోని వినాయక హిల్స్, రోడ్ నెం.5, ఫేజ్-2 ప్రాంతానికి చెందిన రంగనాథ్ (36) ఫిర్యాదు మేరకు ఆయన తండ్రి విజయానంద్ (72), రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, నాగోల్‌లోని కో-ఆపరేటివ్ బ్యాంకు కాలనీలో ఉన్న శ్రీనివాస వృద్ధాశ్రమంలో గత ఒకటిన్నర నెలలుగా ఉంటున్నారు. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున 1.16 గంటల సమయంలో వృద్ధాశ్రమం నుంచి బయటకు వెళ్లిన విజయానంద్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అదృశ్యమైన విజయానంద్ ఎత్తు సుమారు 5 అడుగుల 5 అంగుళాలు, బరువు 60 కిలోలు, గుండ్రటి ముఖం కలిగి ఉంటారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో తెలుపు రంగు చొక్కా, నీలం రంగు చెక్స్ నిక్కర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా నాగోల్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712662751కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ కోరారు.

# రాక్ టౌన్ కాలనీ నీటి కష్టాలు తీర్చాలి

**- ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేసిన రాక్ టౌన్ కాలనీ సంక్షేమ సంఘం - ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి విజ్ఞప్తి.**

నాగోల్, జూన్ 4: భారతశక్తి, నాగోల్ డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని కాలనీ అధ్యక్షుడు వినోద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల సురేందర్ యాదవ్, మనసురాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి బృందంతో కాలనీ ప్రతినిధులతో కలిసి మల్కాజ్గిరి ఎం.పీ ఈటెల రాజేందర్ గారికి వినతిపత్రం అందజేశారు.

**- వేసవి ఇబ్బందులపై వినోద్ రెడ్డి ఆవేదన**

ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో నీటి కొరత తీవ్రంగా ఉందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వేసవి కాలంలో కాలనీవాసులు నీటి కోసం పడుతున్న ఇబ్బందులను వివరించారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని, ఇందుకు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం ఒక్కటే శాశ్వత పరిష్కారమని ఆయన పేర్కొన్నారు. కాలనీ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్.. వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**- కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు**



ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కాలనీ ఉపాధ్యక్షుడు మణిపాల్ రెడ్డి, సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, సంజీవరెడ్డి, భీమిడి వెంకట్ రెడ్డి, రామ్ రెడ్డి, కొండల్ రెడ్డిలతో పాటు స్థానిక నాయకులు, కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.

## గురువారం బాధ్యతలు స్వీకరించిన జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 04 : జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి సంతోష్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి గా ఐ. ప్రసన్న ఎఫ్ఏసి గా స్వీకరించిన పదవి బాధ్యతలు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 04: గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి గా ఐ. ప్రసన్న ఎఫ్ఏసి గా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన దృశ్యం.

## చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా : నస్పూర్ పోలీసులు




మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 4 ( భారతశక్తి):రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ మరియు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గురువారం రోజున మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీసీ నస్పూర్ ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలో పలు దుకాణాలు, పాన్ షాపులు, టీ స్టాల్స్, స్మోకింగ్ జోన్లు, యువత ఎక్కువగా గుమికూడే ప్రదేశాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ మాట్లాడుతూ, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా నిరంతర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయం, నిల్వ లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(భారత శక్తి) జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి, మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు, హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో భారీ చోరీ ఉదంతం

**- గోవాలో అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్న పాట్ మార్కెట్ పోలీస్!**

సికింద్రాబాద్: జూన్ 4 భారతశక్తి, సికింద్రాబాద్ పరిధిలో జరిగిన ఒక భారీ ఇండ్ల దొంగతనం కేసుకు సంబంధించి మార్కెట్ పిఎస్ పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, గోవాలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి దాదాపు రూ. 82 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజ్‌గిరి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఐజూ) శ్రీ చ. శ్రీధర్, ఖూా ఒక ప్రకటనలో తెలిపారు.

**కేసు వివరాలు:**

పాట్ మార్కెట్‌లోని 'శ్రీ సాయి బులియన్ జ్యువెలరీ షాప్' ఉద్యోగి అయిన సందీప్ రఘునాథ్ చవాన్ (29) మే 27 రాత్రి 9 గంటల సమయంలో మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను విధుల్లో ఉండగా ఇంట్లో తాళాలు పగలగొట్టి, లోపలి చెక్క పెట్టెలో దాచిన భారీ మొత్తంలో బంగారం, వెండిని దుండగులు దోచుకెళ్లినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు మార్కెట్ పోలీసులు క్రైమ్ నెం. 140/2026 కింద, దీచీూ సెక్షన్స్ 331(3), 305(ఛు) ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి గురైన సొత్తులో సుమారు 576 గ్రాముల బంగారు ఆభరణాలు, స్వచ్ఛమైన బంగారం, మరియు 900 గ్రాముల వెండి ఉన్నట్లు తేలింది. వీటి మొత్తం విలువ సుమారు రూ. 82 లక్షలుగా అంచనా వేశారు.

**- గోవాలో చేజ్.. నిందితుడి అరెస్ట్:**

ఈ కేసును ఛేదించేందుకు ఉన్నతాధికారుల అనుమతితో ప్రత్యేక పోలీసు బృందం రంగంలోకి దిగింది. నిందితుడి ఆచూకీని ట్రాక్ చేస్తూ గోవాకు వెళ్లిన ప్రత్యేక బృందం.. జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో ఉత్తర గోవాలోని 'కలంగుట్' పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడిని పట్టుకుంది.

**విచారణలో నిందితుడి వివరాలు ఇలా ఉన్నాయి:**

-పేరు:మనోజ్ సింగ్ (28), తండ్రి: శ్యామ్ సింగ్
-చిరునామా: బుధ్ బజార్ రోడ్, భగత్ కాలనీ, బురారీ, నార్త్ ఢిల్లీ.

నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి దొంగిలించబడిన రూ. 82 లక్షల విలువైన మొత్తం బంగారు, వెండి సొత్తును పోలీసులు రికవరీ చేశారు.



**గజదొంగ ట్రాక్ రికార్డ్:**

పోలీసుల విచారణలో మనోజ్ సింగ్ ఒక ప్రమాదకరమైన అంతర్రాష్ట్ర అలవాటు లేని దొంగ (ఝుఎఙ్ఖుశ్రీ దీబతీస్త్రశ్రీఖతీ) అని తేలింది. కేవలం ఢిల్లీలోనే ఇతనిపై 19 దొంగతనం కేసులు నమోదయ్యాయి. పలు కేసుల్లో ఇతనిపై నాన్-బైలబుల్ వారెంట్లు (చీదీఔం) కూడా పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఢిల్లీలోని తీహార్ జైలులో ఏడు క్రిమినల్ కేసులకు సంబంధించి శిక్ష కూడా అనుభవించాడు. నిందితుడి అరెస్ట్ సమాచారాన్ని తదుపరి చర్యల నిమిత్తం ఢిల్లీ పోలీసులకు కూడా చేరవేసినట్లు అధికారులు తెలిపారు.

**- పోలీసు బృందానికి అభినందనలు:**

మల్కాజ్‌గిరి సీపీ శ్రీమతి బి. సుమతి, ఖూా మార్గదర్శకత్వంలో, మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ శ్రీ చ. శ్రీధర్, ఖూా పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్‌లో.. మల్కాజ్‌గిరి డివిజన్ ఏసీపీ శ్రీ వి. యాదగిరి రెడ్డి, మార్కెట్ పిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీ వి. రాంచందర్ నేతృత్వంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎస్.ఎమ్. బషీర్ అహ్మద్, ఎస్సైలు చ. నరేష్, ఎ. నరేష్, చ. రవి మరియు సిబ్బంది అత్యంత ప్రతిభ కనబరిచి కేసును ఛేదించారు. సమర్థవంతంగా పనిచేసిన ఈ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని డీసీపీ పేర్కొన్నారు. అయితే నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కూడా అంతే కీలకమని ఆయన స్పష్టం చేశారు.

**ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు:**

- ఇండ్లకు వెళ్లేటప్పుడు, తాళాలు మరియు విలువైన వస్తువులను భద్రపరుచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
-వీలైనంత వరకు ఇండ్ల వద్ద, అపార్ట్‌మెంట్లలో సీసీటీవీ (జజుు) కెమెరాలు, సెంట్రల్ లాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలి.- అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు తప్పనిసరిగా నమ్మకమైన సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలి.
-కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఉచిత రక్త పరీక్షల కార్యక్రమం ప్రారంభం

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 04 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బిక్నూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించి, మహిళలకు నిర్వహిస్తున్న రక్త పరీక్షల తీరును పరిశీలించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి తగిన చికిత్స పొందాలని సూచించారు.మహిళా సంఘాల సభ్యులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువవుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవీందర్, సర్పంచ్ చైర్మెన్, తహసీల్దార్, డిఆర్డీఓ దామోదర్ రెడ్డి, ఏడిఎల్ డిఆర్డీఓ విజయలక్ష్మి, మండల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సంకష్టహర చతుర్థి సందర్భంగా గణపతికి విశేష పూజలు

జగిత్యాల, జూన్ 4 (భారత శక్తి ప్రతినిధి): సంకష్టహర చతుర్థి సందర్భంగా అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని గణపతికి గణపతి ఉపనిషత్‌లతో అభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, అర్చకులు విశ్వనాథ శర్మ, ద్యావళ్ల సాయికుమార్, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్, స్థానిక వేదపండితులు మధు రామశర్మతో పాటు గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.





# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 04:(భారత శక్తి) పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనకు సమాజమంతా కృషి చేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పేర్కొన్నారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్‌లోని పంచశీల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బి. తిరుపతి, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యంపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ మోహన్‌రావు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ "వన్ ఎర్త్ -- వన్ ఛాన్స్" అని పేర్కొంటూ, నేలను కాలుష్య కోరల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# ఉత్తమ సేవలకు గుర్తింపుగా 11 మంది పోలీసు అధికారులకు సేవా పథకాలు.




నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 04(భారత శక్తి): పోలీసు శాఖలో విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను 2026 సంవత్సరానికి నిర్మల్ జిల్లా నుంచి 11 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సేవా పథకాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఎంపికైన అధికారులను, సిబ్బందిని పథకాలతో సత్కరించి అభినందించారు. సేవా పథకాలకు ఎంపికైన వారిలో షేక్ అహ్మద్ (ఏఎస్ఐ), ఆర్. గంగారాం (ఏఎస్ఐ), వై. గంగాధర్ (ఏఎస్ఐ), డి. రాజారాం (హెడ్ కానిస్టేబుల్), పి. మస్తాన్ రావు (హెడ్ కానిస్టేబుల్), పి. రత్నారావు (హెడ్ కానిస్టేబుల్), హెచ్. గంగాధర్ (హెడ్ కానిస్టేబుల్), బి. గోవింద్ (హెడ్ కానిస్టేబుల్), జె. గేమ్ సింగ్ (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్), వెట్టి సింగ్ (హెడ్ కానిస్టేబుల్), కె. రమేష్ (పోలీస్ కానిస్టేబుల్) ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. జానకి షర్మిల మాట్లాడుతూ, విధి పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందడం పోలీసు సిబ్బంది ప్రధాన బాధ్యత అని అన్నారు. సేవా పథకాలకు ఎంపిక కావడం గర్వకారణమని, ఇది మరింత బాధ్యతాయుతంగా పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ రామ్ నిరంజన్ రావుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కమలాపూర్ ప్రత్యేక గ్రామసభలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన




జగిత్యాల, జూన్ 4 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ కుమ్మరి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామసభకు వివిధ శాఖల అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో పత్తి రవీందర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు పరిశుభ్రత, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ఎస్సై గురుక మహేష్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు ఇతర వ్యక్తులకు చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే 18 సంవత్సరాలు నిండని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి విపత్తుల సమయంలో రెవెన్యూ శాఖ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. తిమ్మాపూర్ క్లస్టర్ ఏఈఓ సమతా మాట్లాడుతూ వర్షపాతం పరిస్థితులను గమనించి వ్యవసాయ శాఖ సూచనల మేరకు విత్తనాలు నాటుకోవాలని రైతులకు సూచించారు. ఏపీఎం ప్రవీణ్ మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పవన్ మాట్లాడుతూ కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మ్యూల్ అకౌంట్లతో సైబర్ నేరాలకు సహకారం

**- ఐదుగురు అరెస్ట్**

**-రూ.8.18 కోట్ల లావాదేవీలు గుర్తింపు**

**- ఎస్పీ జానకి షర్మిల.**




నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 04:(భారత శక్తి) డబ్బు ఆశతో తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించి ఆన్‌లైన్ మోసాలకు సహకరించిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. లోకేశ్వరం, సోన్ మండలాలకు చెందిన వీరి ఖాతాల ద్వారా సుమారు రూ.8.18 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు విచారణలో వెల్లడైందని జిల్లా పోలీసు అధికారి డా. జి. జానకి షర్మిల తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు 2024 సంవత్సరం నుంచి తమ పేర్లతో పాటు వ్యాపార సంస్థల పేర్లపై వివిధ బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు ప్రారంభించారు. అనంతరం వాటికి సంబంధించిన ఏటీఎం కార్డులు, చెక్‌బుక్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను సైబర్ నేర ముఠాలకు అందజేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అమాయకులను ఆన్‌లైన్ మోసాలకు గురిచేసి సంపాదించిన డబ్బును ఈ ఖాతాల ద్వారా స్వీకరించి, ఇతర ఖాతాలకు బదిలీ చేస్తూ నేరగాళ్లు డబ్బు జాడను దాచిపెట్టినట్లు విచారణలో తేలింది. ఇందుకు ప్రతిఫలంగా ఖాతాదారులు కమీషన్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో నిమ్మ గజేందర్‌పై 9, మగ్గిడి నవీన్‌పై 28, మగ్గిడి మహేందర్‌పై 5, మేకల నిఖిల్‌పై 16, శికారి సాయి కృష్ణపై 6 సైబర్ ఫిర్యాదులు నమోదయ్యాయి. ఖాతాల విశ్లేషణలో నిమ్మ గజేందర్‌కు చెందిన ఆర్వీ ట్రేడర్స్ ఖాతా ద్వారా రూ.2.69 కోట్లు, మగ్గిడి నవీన్‌కు చెందిన అజాన్ ట్రేడర్స్ ఖాతా ద్వారా రూ.2.11 కోట్లు, మగ్గిడి మహేందర్‌కు చెందిన ఎన్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ ఖాతా ద్వారా రూ.91.36 లక్షలు, మేకల నిఖిల్‌కు చెందిన హెచ్ఆర్ ఆటోమొబైల్స్ హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ ఖాతా ద్వారా రూ.1.18 కోట్లు, శికారి సాయి కృష్ణకు చెందిన హెచ్ఎన్ ఎంటర్‌ప్రైజెస్ ఖాతా ద్వారా రూ.1.28 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. లోకేశ్వరం మండలానికి చెందిన ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, సోన్ మండలానికి చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరికి సంబంధించిన ఇతర బ్యాంకు ఖాతాలు, సైబర్ నేర ముఠాలతో ఉన్న సంబంధాలు, కమీషన్ చెల్లింపులు, డిజిటల్ ఆధారాలపై మరింత లోతైన విచారణ కొనసాగుతోందన్నారు.

**జాగ్రత్తగా ఉండాలి : ఎస్పీ**

ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ డబ్బు ఆశతో తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్స్, మొబైల్ నంబర్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను ఇతరులకు అప్పగించవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి చర్యలు సైబర్ నేరాలకు సహకరించినట్లుగా పరిగణించబడతాయని హెచ్చరించారు. అనుమానాస్పద సైబర్ కార్యకలాపాలు గమనించిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## గ్రామసభల్లోని అభివృద్ధి ప్రణాళికతో

# గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**



రేగొండ,జూన్ 4 (భారత శక్తి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభల్లో గ్రామ అభివృద్ధి చేపట్టే అభివృద్ధి పనులకు కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో గురువారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు స్థానిక సర్పంచ్ వారణాసి మౌలిక-అంజి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్రతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామసభల ప్రధాన ఉద్దేశ్యం గ్రామాల సమస్యలను గుర్తించి, మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను సంబంధిత అధికారులు సేకరించాలని ఎమ్మెల్యే గండ్ర సూచించారు. అలాగే పెన్షన్లు, రేషన్ కార్డులు, రైతు సంక్షేమ పథకాలు సహా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయో లేదో గ్రామస్థులు పరిశీలించాలని సూచించారు.గ్రామ స్థాయి నుంచే సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, ఇలాంటి సభలకు కొందరు అధికారులు హాజరు కాకపోవడం ఎమ్మెల్యే గండ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పనిలో సంఖ్య పెంచాలని, సకాలంలో వారికి డబ్బులు పడేలా అధికారులు చూడాలని ఎమ్మెల్యే గండ్ర సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ సభలో సంబంధిత అధికారులు భూభారతి, సాదా బైనామా, విద్యుత్తు, రైతు సమస్యలు పంటల వివరాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, స్థానిక తాసిల్దార్ కే శ్వేత, ఎంపీడీవో యం వెంకటేశ్వర్ రావు,ఏవో వాసుదేవ రెడ్డి, ట్రాన్స్కో ఏఈ వంగ రాజు, సిఐ కరుణాకర్, ఎస్సై సుధాకర్, హౌసింగ్ ఏఈ హేమలత, ఇరిగేషన్ ఏఈ, స్థానిక కార్యదర్శి దండె రాజ్ కుమార్, ఉప సర్పంచ్ ఎల్దొండి నరేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పున్నం రవి,టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి,ఎడ్ల మల్లారెడ్డి, సర్పంచులు గడ్డే రఘు, నడిపెల్లి వెంకట్రావు, రోంటాల సదయ్య, కోలపాక ప్రసంగి, సామల సురేందర్,పున్నం భాస్కర్, అంగన్వాడీ టీచర్లు, మహిళా గ్రూప్ సభ్యులు, ఆశా వర్కర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై

# క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలి

**ధర్మపురి గోదావరి పరిధిలో ప్రస్తుతం అధికారిక ఇసుక తవ్వకాల అనుమతులు లేవు: జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

జగిత్యాల, జూన్ 4 (భారత శక్తి ప్రతినిధి): జిల్లాలో ఇసుక రీచ్‌ల గుర్తింపు, తవ్వకాలపై క్షేత్రస్థాయి అధ్యయనాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌లు లేవని, వర్షాకాలం అనంతరం భూగర్భ జల శాఖ ద్వారా సమగ్ర అధ్యయనాలు నిర్వహించి ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బలహీన వర్గాల గృహ నిర్మాణాలకు మినహా అన్ని ఇసుక లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని స్పష్టం చేశారు. ఇసుక తవ్వకం, రవాణా, విక్రయాల్లో పారదర్శకత పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధర్మపురి మండలంలోని గోదావరి నదిలో ప్రస్తుతం ఎటువంటి అధికారిక ఇసుక తవ్వకాల అనుమతులు లేవని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో అనువైన ఇసుక నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం నుంచి గోదావరి నది పరిధిలో అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ గనుల అభివృద్ధి సంస్థకు అప్పగించే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఆర్డీవోలు మధుసూదన్, జి. నర్సింహారావు, దివాకర్ రెడ్డి, జిల్లా భూగర్భ జల అధికారి శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఈ. మురళి, గనులు మరియు భూగర్భశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# అక్రిడేషన్ కమిటీ సభ్యులకు అక్రిడేషన్ కార్డులు అందజేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 04 (భారతశక్తి): అక్రిడేషన్ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో అక్రిడేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను అభినందించిన కలెక్టర్, మీడియా ప్రతినిధులు ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన మీడియా ప్రతినిధులకు శుక్రవారం నుండి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సంబంధిత మీడియా ప్రతినిధులు నిర్ణీత సమయంలో కార్యాలయానికి వచ్చి తమ అక్రిడేషన్ కార్డులను స్వీకరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ఒక ముఖ్యమైన స్తంభమని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు విశేష సేవలు అందిస్తున్నారని కలెక్టర్ అన్నారు. మీడియా ప్రతినిధులు తమ వృత్తి నిబద్ధతను కొనసాగిస్తూ ప్రజలకు నిష్పాక్షిక సమాచారాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి అజ్గర్ హుస్సేన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, సమాచార, పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## పోలేరమ్మ దేవాలయంను తనిఖీ చేసిన

# మఠాధిపతి వేంకటాద్రిస్వామి



**బ్రహ్మంగారి మఠం(భారత శక్తి)** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం అనుసంధానమైన శ్రీ కనుమ పోలేరమ్మ వారి దేవస్థానమును గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేసిన మఠం మఠాధిపతులు వీర ధర్మజ వేంకటాద్రి స్వాములవారు.శ్రీ పోలేరమ్మ దేవస్థానం మరియు పరిసర ప్రాంతాలు అన్నిటిని కూడా పరిశీలించి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు.అనంతరం దేవస్థానంలో ఉన్నటువంటి సీసీ కెమెరాలు కూడా స్వామివారు పరిశీలించారు.అనంతరం అక్కడ నూతన నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు పరిశీలించి అతి త్వరలో భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని మేనేజర్ ని ఆదేశించారు.

## ట్రిపుల్ ఐటీల్లో 5 నుంచి

# ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

### - 12న ఎంపిక జాబితా విడుదల.

**కడప(భారత శక్తి)** ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 5 నుంచి ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ అమ రేంద్రకుమార్ సంద్రా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణను ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్లో నిర్వహించేందుకు షెడ్యూల్ చేశామన్నారు.

ఈ నెల 5, 6, 8 తేదీలలో ప్రత్యేక కేటగిరీ కింద 2453 అభ్యర్థుల్లో ఎన్సీసీ 1289, స్పోర్ట్స్ 450, బీఎస్ 282, సీఏపీ 237, దివ్యాంగులు 195 మంది ఉన్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులు కలిపి రిజర్వేషన్ ప్రాతిపదికన మెరిట్ జాబితాను తయారు చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రవేశాలకు సంబంధించిన ఎంపిక జాబితాను ఈ నెల 12వ తేదీన విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

## ముగిసిన మజ్జిగ వితరణ

# చలివేంద్రం కార్యక్రమం



**ఆళ్లగడ్డ (భారత శక్తి)** వేసవికాలం సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గత ఏప్రిల్ 24న ఆళ్లగడ్డ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ప్రారంభమైన మజ్జిగ వితరణ కార్యక్రమం ప్రతి గురువారం మరియు ఆదివారం రోజుల్లో కొనసాగుతూ గురువారం జూన్ 4వ తేదీన ముగిసినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం కు సత్యసాయి సేవా సంస్థలు నంద్యాల జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి జ్ఞాపిక అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ కృష్ణ, డా సుబ్బారావు, డా నరేంద్ర దేవ్ సత్యసాయి సేవాదళ్ సభ్యులు ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన యురాలజీ ఆపరేషన్ చేసిన కేజీహెచ్ డాక్టర్లు

**(భారత శక్తి)**కింగ్ జార్జి ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ యురాలజీ విభాగం హెడ్ డా.ఐ. చంద్రశేఖర్ మరియు ఆయన వైద్య బృందం విజయవంతంగా చేశారు.వివరాల లోకి వెళ్ళితే, టి.రజని అనే 37 సంవత్సరాల వయస్సు గల విజయనగరం జిల్లా కు చెందిన యువతి ఒక సంవత్సరం నుండి కడుపు ఉబ్బి పోవడం, కడుపు నొప్పితో బాధ పడుతున్నది. ఆమె కింగ్ జార్జ్ హాస్పిటల్ లో యూరాలజి విభాగం లో తేది: 14.05.2026 న అడ్మిట్ అయ్యారు. ఆమెకు ఆసుపత్రి లో వివిధ రకాల వైద్య పరీక్షల జరపగా ఆమె కు, కడుపులో అడ్రినల్ గ్రంధిలో కుడివైపు 6 సెంటి మీటర్లు, ఎడమవైపు 28 సెంటి మీటర్ల కణితి ఉన్నట్టుగా గుర్తించారు. ఈ రకమైన వ్యాధి ఒక లక్ష మందిలో నలుగురికి మాత్రమె వస్తుంది. దీనిని బైలాటరల్ అడ్రినల్ మైలోలిపోమా విత్ కంజెనిటల్ అడ్రినల్ హైపర్ ప్లాసియా వ్యాధి గా గుర్తించారు. ఐఉఊ యూరాలజీ విభాగాధిపతి డా.ఐ. చంద్రశేఖర్ అద్వైర్యములో యూరాలజీ వైద్య బృందం తేది.19.05.2026 న ఆమెకు శస్త్ర చికిత్స చేసారు. పేషెంట్ ఆరోగ్యం నిలకడ ఉంది.ఈ సంధర్భం గా కె జి హెచ్ సూపరింటెండెంట్ డా.ఐ. వాణి, యూరాలజీ మరియు అనస్తీషియా వైద్య బృందాన్ని అభినందించారు.ఐ.వాణి సహకారం తో ఈ ఆపరేషన్ సమర్థవంతంగా పూర్తి చేసారు. ఈ ఆపరేషన్ లో అనస్తీషియా విభాగం నుండి డా. కే. శ్రీలక్ష్మి హెడ్ అఫ్ డిపార్టుమెంటు అనస్తీషియా మరియు డా. శరత్ చంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్, యూరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.అప్పలరాజు, డా. వెంకట కృష్ణ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డా. దత్తాత్రేయ సేవలందించారు. పేషంట్ రజని పూర్తి ఆరోగ్య వంతంగా ఈ రోజు డిశ్చార్జ్ అవుతున్నారు.ఈ అరుదైన ఆపరేషన్ కు ముందుగా ఎండోక్రినాలజీ టీం మేనేజ్మెంట్ చేయడం వలన ఈ అరుదైన ఆపరేషన్ పూర్తి చేసామని యూరాలజీ హెడ్ ఆఫ్ డిపార్టుమెంటు డా. చంద్రశేఖర్ తెలియ చేసారు. తనకు తిరిగి జన్మనిచ్చిన వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు

## రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు

# గ్రహీతలకు సన్మానం

- రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవా అవార్డు గ్రహీత హుజురాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ కు సన్మానం.
- కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఏఎస్ఐ బి.సంపత్.


**కరీంనగర్ (భారత శక్తి)** రాష్ట్రస్థాయి ఉత్తమ పోలీసు సేవ అవార్డు గ్రహీతలు హుజురాబాద్ టౌన్ సిఐ టీ. కరుణాకర్, కానిస్టేబుల్ హెచ్ సి.మల్లయ్య, ఇటీవల బదిలీ పై వచ్చిన ఏఎస్ఐ బి.సంపత్ లను టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలోహుజురాబాద్ బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా హుజురాబాద్ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, బీసీ ముద్దు బిడ్డ టీ.కరుణాకర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవ పోలీసు అవార్డును అందుకోవడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ హుజురాబాద్ కీర్తి పతాకాన్ని రాష్ట్రస్థాయిలో రెపరెపలాడించిన వారి సేవలను కొనియాడినారు. ముఖ్యంగా సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సముచితమైనటు వంటి న్యాయముజరుగునట్లు చూడవలసిన గురుతరమైన టువంటి బాధ్యత వారిపై ఉందని ఈ సందర్భంగా గుర్తుచేసినారు. అదేవిధంగా తమ విధిని చట్ట ప్రకారము నిర్వర్తించి అన్ని వర్గాల ప్రజల ఆధారాభిమానాన్ని చూరగొనే విధంగా ఇంకా రెట్టింపు సేవలను సమాజములోని అన్ని వర్గాల ప్రజలకుఅందించి జాతీయస్థాయిలో ఒక ఉత్తమ పోలీస్ ఆఫీసర్గా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించినారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శిఇప్పకాయల సాగర్, శాలపల్లి ఇందిరానగర్ సర్పంచ్ కోడిగుడి ప్రవీణ్, హుజురాబాద్ మండలకాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్లా రాధా, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు రామ్ సారయ్య, తునికి సమ్మయ్య, ప్రతాప నాగరాజు, మంచి కట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అడవులను రక్షిద్దాం - ప్రకృతిని కాపాడుదాం

### - నగరవనంలో మొక్కలు నాటిన కే. కుమార్

**పిడుగురాళ్ల (భారత శక్తి)** జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా "అడవులను రక్షిద్దాం- ప్రకృతిని కాపాడుదాం" అనే నినాదంతో రాజుపాలెం మండలం దేవరంపాడు నగరవనం లో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే. కుమార్ మీడియాతో మాట్లాడుతూ, అడవులను రక్షించడం, మొక్కలను నాటడం ప్రతి ఒక్కరి దిన చర్యలో భాగం కావాలని, ప్రకృతిని నాశనం చేసుకుంటే ఈ భూమ్మీద జీవం అనే ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలను నాటండి ప్రకృతిని పరిరక్షించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా.. మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్ర



**చాగలమర్రి (భారత శక్తి)** కార్యకర్తలకు వెన్నంటి అండగా ఉంటానని ఆళ్లగడ్డ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రీజెంద్రారెడ్డి అన్నారు. గురువారం నేలంపాడు గ్రామంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదని నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. రైతే రాజని, వైయస్ జగన్ అన్న హయాంలో రైతు సంక్షేమానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందరూ కూడా రాజన్న రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని రానున్న రోజుల్లో జగనన్న నాయకత్వమును కోరుతున్నారన్నారు. ఈయన వెంట వైసిపి నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, గంగుల అభిమానులు ఉన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

### - ఎన్.డి. విజయజ్యోతి, డీసీసీ అధ్యక్షురాలు



**బద్వేలు(భారత శక్తి)** బద్వేల్, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి సహాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్ కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం బద్వేల్ ఆర్ ఆ బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో అనర్హుల పేర్లు, మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి ఉన్న బహుళ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు.జూన్ 5 నుండి జూన్ 14 వరకు అధికారులు సన్నాహక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలోని వివరాలను 2002 ఎన్నికల జాబితా మరియు కుటుంబ సభ్యుల వివరాలతో సరిపోల్చి పరిశీలించనున్నారని చెప్పారు.బద్వేల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ బూత్ స్థాయి సహాయకులను నియమించాలని, ప్రతి బీఎల్ఏ రోజుకు కనీసం 50 దరఖాస్తులను బీఎల్ఓలకు అందజేసేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా బీఎల్ఏలు రోజుకు 10 వరకు దరఖాస్తులను కూడా బీఎల్ఓలకు సమర్పించవచ్చని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తారని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇదే కాలంలో కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులను కూడా స్వీకరిస్తారని తెలిపారు.తుది ఓటరు జాబితా సెప్టెంబర్ 22న ప్రచురించబడుతుందని చెప్పారు. ఎన్నికల నమోదు అధికారి నిర్ణయంపై అసంతృప్తి ఉన్నవారు 15 రోజులలోపు జిల్లా మేజిస్ట్రేట్కు లేదా 30 రోజులలోపు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి కు అప్పీల్ చేసుకోవచ్చని వివరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించే దిశగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పర్యవేక్షణ చేస్తుందని ఎన్.డి. విజయజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ అచ్యుత రాజు, బద్వేల్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, పోరుమామిళ్ల మండల పార్టీ అధ్యక్షుడు అన్వర్, జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు భాష, బి.కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు గురప్ప , బద్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ,కాశి నాయన మండల పార్టీ అధ్యక్షుడు పుల్లూరు పెద్ద కాజావలి , యూత్ కాంగ్రెస్ నాయకులు ముజాహిద్, నాయబ్ రసూల్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరుమలయ్య , తదితరులు పాల్గొన్నారు

## మారుతున్న కాలానికి అనుగుణంగా

# విద్యాబోధన ఆవశ్యకత

### - మండల విద్యాశాఖాధికారులు ఎండీ. ఖాసిం, వై. శ్రీనివాసరావు




**పిడుగురాళ్ల (భారత శక్తి)** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండీ. ఖాసీం అన్నారు. పిడుగురాళ్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూడవ సంవత్సరం జ్ఞాన ప్రకాష్ ఒకటి, రెండవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు, మెగా డీఎస్సీ ద్వారా ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు ది. 04-06-2026 నుండి 9వ తేదీ వరకు జరుగు పునాది అన్నారు. అక్షరాస్యత సంఖ్యా జ్ఞానం (ఎఫ్ ఎల్ ఎన్ ) కింద 60 రోజుల సర్టిఫికెట్ కోర్స్ అమల్లో భాగంగా శిక్షణా కార్యక్రమం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలకు అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు మెగా డీఎస్సీ 2025 ద్వారా పల్నాడు ప్రాంతంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ నియమాలు చేపట్టటం జరిగిందని అన్నారు. ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని తమ తమ పాఠశాలలో అమలుపరిచి, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలంటే నమ్మకం ఏర్పడే విధంగా బోధించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సౌకర్యాలు, సదుపాయాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. శిక్షణకు సమయపాలన ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరొక మండల విద్యాశాఖ అధికారి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను 100% ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. మల్లికార్జునరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కార్యాచరణ ఆధారిత, భాగస్వామ్య, ఆటలాధారిత బోధనా పద్ధతులను అనుసరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ పీలు దాసరి లూర్దు మేరీ, డిఆర్పీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు

### - రుద్రవరంలో వైఎస్ఆర్సిపి భారీ నిరసన ర్యాలీ.




**రుద్రవరం (భారత శక్తి)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ రుద్రవరంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు నిరసన గళం విప్పారు. వైఎస్ఆర్సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరియు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) ఆదేశాల మేరకు గురువారం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ నుండి అమ్మవారి శాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. "వెన్నుపోటుకు రెండేళ్లు" అంటూ నినాదాలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరితమైన హామీలను నమ్మి ప్రజలు ఓటు వేస్తే, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమ య్యారని గంధం రాఘవరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆశలను ఆశలను అడియాసలు చేస్తోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం కూలిపోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రసాద్ రెడ్డి,, టి ఏ నరసింహారావు, హరి నారాయణ, డే గాని వెంకటేష్, జాకీర్ హుస్సేన్, పెద్దన్న,పాణ్యం చంద్ర, సవరం నాగ ముని, మాధవ, జయరాముడు, శూలం ప్రభాకర్, డిష్ భాస్కర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఫుట్బాల్ లీగ్ మ్యాచ్ ను ప్రారంభించిన డి.ఎస్.పి. శ్రీనివాస రావు



**ఆళ్లగడ్డ (భారత శక్తి)**ఆళ్లగడ్డలోని వై.పి.పీ.ఎం ప్రభుత్వ పాఠశాల క్రీడ మైదానంలోగురువారంఏపీ స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ఆర్ ఆర్ .అకాడమీ నిర్వహిస్తున్న ఫుట్బాల్ సమ్మర్ కోచింగ్ పోటీలను డిఎస్పి శ్రీనివాసరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ ద్వారా మీకు ఇష్టమైన గేమ్ లో బాగా రాణించి మన ఆళ్లగడ్డకు నంద్యాల జిల్లాకి మంచి పేరు తేవాలని అలాగే జిల్లా క్రీడల పట్ల తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించి,శారీరికంగా మానసికంగా భవిష్యత్తులో ఉద్యోగాలలో ఆర్మీ రిజర్వ్ పోలీస్ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలోన్యాయవాది వినోద్ కుమార్,(ఆర్ ఆర్ .అకాడమీ వైస్ ప్రెసిడెంట్) మాట్లాడుతూ ఆళ్లగడ్డలో శ్రీ సోమల రమణారెడ్డి ఆర్ఆర్ అకాడమీ గత మూడు సంవత్సరాల నుండి క్రీడలలో ప్రతిభ ఉన్న క్రీడాకారుల కోసం వివిధ రకాల క్రీడలను లను నిర్వహించి ఆణిముత్యాలను బయటికి తీయడమే ఆర్ఆర్ అకాడమీ యొక్క ముఖ్య లక్ష్యం అని అన్నారు. కోచ్ సుబ్బరాయుడు, మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరంలో ఆర్ఆర్ అకాడమీ నుండి క క్రికెట్, హ్యాండ్ బాల్, ఫుట్బాల్, రెజ్లింగ్ పోటీలలో శిక్షణ ఇచ్చి జాతీయస్థాయి పోటీలలో కూడా ఆళ్లగడ్డ నుండి ప్రతిభను ప్రదర్శించి పథకాలు సాధించిన వారు ఉన్నారు అని రాబోయే రోజుల్లో ఇంకా నైపుణ్యత మైనటువంటి శిక్షణ ఇచ్చి మంచి ఫలితాల కోసం పనిచేస్తామన్నారు. నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ ట్రెజరర్ సిద్దు మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుండి మంచి ఫుట్బాల్ క్రీడాకారులను శిక్షణ ఇచ్చి పంపించడమే మా అసోసియేషన్ యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఫుట్బాల్ అసోసియేషన్ కోచ్ అఖిల్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి, ప్రతాప్, దివాకర్, రవి, దేవేంద్ర, బాలు, శివ, నాగరాజు ఏపీ ఎస్పీ సీనియర్ ఫుట్బాల్ క్రీడాకారుడు శ్రీను , పాల్గొన్నారు

## పీఎం స్వనిధి: వీధి వ్యాపారులకు

# ఆర్థిక చేయూత

### పీఎం స్వనిధి గురించి తరుచుగా అడిగే ప్రశ్నలు

**1. పీఎం స్వనిధి అంటే ఏమిటి?**

పీఎం స్వనిధి అనేది వీధి వ్యాపారులకు మూలధన సహాయాన్ని, ఆర్థిక భాగస్వామ్యం, సామాజిక భద్రతను అందించే కేంద్ర ప్రభుత్వ పథకం

**2. దీనిని ఎందుకు ప్రవేశపెట్టారు?**

కోవిడ్19 మహమ్మారి సమయంలో తీవ్రంగా దెబ్బతిన్న వీధి వ్యాపారులకు నిర్వహణ మూలధనాన్ని అందించే లక్ష్యంతో పీఎం-స్వనిధిని ప్రారంభించారు. అసంఘటిత కార్మిక శక్తిని కలిగి, అనధికారిక శ్రామిక శక్తిలో కీలక భాగమై ఉండి, సాధారణంగా బ్యాంకింగ్ రుణ సదుపాయాలు పెద్దగా లేని వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన మొట్టమొదటి మైక్రో-క్రెడిట్ పథకం ఇది. వారి వ్యాపార వృద్ధికి తోడ్పాటునందిస్తూనే, వారిని ఆర్థిక సమేళనం పరిధిలోకి తీసుకురావడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

**3. పీఎం స్వనిధి ఎప్పుడు ప్రారంభమైంది. ఏ మంత్రిత్వ శాఖ దీన్ని అమలు చేస్తుంది?**

ఈ పథక 2020 జూన్ లో ప్రారంభించారు. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఆర్థిక సేవల విభాగం సంయుక్తంగా దీనిని అమలు చేస్తున్నాయి.

**4. పీఎం స్వనిధి పథకం కింద రుణ వ్యవధిని ఎప్పటి వరకు పొడిగించారు?**

ఈ పథకం సాధించిన విజయాలు, సానుకూల ఫలితాల ప్రభావాన్ని పరిగణలోకి తీసుకుని పీఎం-స్వనిధి పునర్వ్యవస్థీకరణను, పొడిగింపును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో భాగంగా.. ఈ పథకం కింద రుణ వ్యవధిని మార్చి 2030 వరకు పొడిగించింది.

**5. వీధి వ్యాపారులు/చిరు వ్యాపారులు అంటే ఎవరు?**

వీధి, ఫుట్‌పాత్, నడకదారి మొదలైన ప్రాంతాలలో తాత్కాలికంగా నిర్మించిన నిర్మాణాల ద్వారా గానీ, లేదా ఒక చోటు నుంచి మరొక చోటుకి తిరుగుతూ గానీ వస్తువులు, సరుకులు, ఆహార పదార్థాలు, లేదా రోజువారీ వినియోగ వస్తువులను విక్రయించే లేదా ప్రజలకు సేవలను అందించే ఏ వ్యక్తినైనా వీధి వ్యాపారిగా పరిగణిస్తారు. వారు విక్రయించే వస్తువులలో కూరగాయలు, పండ్లు, తినడానికి సిద్ధంగా ఉండే వీధి ఆహారం మొదలైనవి ఉంటాయి. అలాగే వారు అందించే సేవలలో మంగలి షాపులు, చెప్పులు కుట్టే వారు, బట్టలు ఉతికే/ఇస్త్రీ సేవలు వంటివి ఉంటాయి.

**6. పీఎం స్వనిధి ద్వారా ఎలాంటి ఆర్థిక సహాయం, ప్రయోజనాలు అందుతాయి?**

వీధి వ్యాపారులు పూచీకత్తు లేని మూలధన రుణాలు దశాల వారీగా రూ.15,000, రూ.20,000; రూ.50,000 వరకు రుణాలను పొందవచ్చు. ఈ పథకం ద్వారా అర్హులైన వ్యాపారులకు వడ్డీ రాయితీ, రుణ హామీ మద్దతు, రూ.30,000 వరకు రుణ పరిమితి కలిగిన యూపీఐ అనుసంధానిత రూపే క్రెడిట్ కార్డును అందిస్తుంది.

**7. సకాలంలో లేదా ముందుగానే రుణాన్ని తిరిగి? చెల్లించినట్లయితే ఏమైనా పోత్సాహకాలున్నాయా?**

అవును. ఉన్నాయి. పీఎం స్వనిధి రుణాలను సకాలంలో లేదా ముందుగానే తిరిగి చెల్లించినట్లయితే ఏడాదికి 7 శాతం వడ్డీ రాయితీ లభిస్తుంది. అలాగే.. సకాలంలో చెల్లించిన వ్యాపారులకు తర్వాతి విడతల్లో మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు పొందేందుకు అర్హత పొందుతారు.

**8. రుణ ఆమోదానికి ఎంత సమయం పడుతుంది?**

రుణ దరఖాస్తు, ఆమోద ప్రక్రియను సులభతరం చేయడం కోసం పీఎం – స్వనిధి పూర్తి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను వినియోగిస్తుంది. రుణ ధృవీకరణ, ఇతర నిబంధనలకు లోబడి.. రుణ ఆమోదానికి సగటున సుమారు 23 రోజుల సమయం పడుతుంది.

**9. సిఫార్సు పత్రం లేదా విక్రయ ధృవీకరణ పత్రం ఉన్న వీధి వ్యాపారులు రుణం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవచ్చు?**

చెల్లుబాటు అయ్యే సిఫార్సు లేఖ లేదా విక్రయ ధృవీకరణ పత్రం కలిగిన వీధి వ్యాపారి.. పోర్టల్ ద్వారా లేదా మొబైల్ యాప్ లో, లేదా పట్టణ స్థానిక సంస్థల సహాయంతో పీఎం స్వనిధి రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**10. పీఎం స్వనిధి ద్వారా ఎంత మంది వీధి వ్యాపారులు ప్రయోజనం పొందారు?**

ఇప్పటి వరకు పీఎం స్వనిధి కింద 75.5 లక్షలకు పైగా వీధి వ్యాపారులు 112 లక్షలకు పైగా రుణాలను పొందారు.

**11. ఈ పథకం కింద పంపిణీ చేసిన మొత్తం ఆర్థిక సహాయం ఎంత?**

దేశవ్యాప్తంగా వీధి వ్యాపారులకు రూ.17,800 కోట్లకు పైగా రుణాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు వడ్డీ రాయితీలు, డిజిటల్ క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకాల ద్వారా దాదాపు రూ.800 కోట్లు అందుకున్నారు.

**12. పీఎం స్వనిధి వీధి వ్యాపారులలో డిజిటల్, ఆర్థిక సమ్మిళితాన్ని ఎలా ప్రోత్సహిస్తుంది?**

ఈ పథకం రూ.1,600 వరకు క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకాలు, ఆర్థిక అక్షరాస్యత మద్దతు ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తుంది. 55 లక్షలకు పైగా వ్యాపారులు దాదాపు రూ.8.96 లక్షల కోట్ల విలువైన 841 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలను పూర్తి చేశారు.

**13. స్వనిధి సే సమృద్ధి అంటే ఏమిటి, అది లబ్ధిదారులకు ఎలా మద్దతు ఇస్తుంది?**

స్వనిధి సే సమృద్ధి కార్యక్రమం లబ్ధిదారుల కుటుంబాల వివరాలను సేకరించి, వారిని ఎంపిక చేసిన ఎనిమిది కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తుంది. ఈ కార్యక్రమం కింద 50 లక్షలకు పైగా కుటుంబాల వివరాలు సేకరించి, 1.52 కోట్లకు పైగా సంక్షేమ ప్రయోజనాలను మంజూరు చేశారు.

**14. పీఎం స్వనిధి పథకం కింద ఎలాంటి శిక్షణ, సామర్థ్య పెంపు మద్దతు అందించబడుతుంది?**

ఈ పథకం కింద ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత మరియు ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో ఆహార భద్రతా పద్ధతులపై శిక్షణను అందిస్తుంది. ఇప్పటి వరకు సుమారు 6 లక్షల వీధి ఆహార విక్రేతలకు ఆహార భద్రత, పరిశుభ్రతా ప్రమాణాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.

**15. జీవనోపాధి, ఆర్థిక సాధికారతపై పీఎం స్వనిధి ఎలాంటి ప్రభావాన్ని చూపింది?**

2023 మరియు 2025లో నిర్వహించిన స్వతంత్ర అధ్యయనాల ప్రకారం.. ఈ పథకం లబ్ధిదారులలో మెరుగైన వ్యాపార స్థిరత్వం, అధిక ఆదాయాలు, బలమైన ఆర్థిక చేరిక కనిపించినట్లు తేలింది.

దాదాపు 95 శాతం మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా మొదటిసారిగా అధికారికంగా బ్యాంకింగ్/ సంస్థాగత రుణాన్ని పొందగలిగారు. సుమారు 30 శాతం మంది లబ్ధిదారులు పీఎం స్వనిధి రుణాలతో పాటు అదనపు రుణ సదుపాయాన్ని కూడా పొందారు. లబ్ధిదారుల వార్షిక ఆదాయాలు సగటున దాదాపు 20 శాతం పెరిగాయి.

**16. పీఎం స్వనిధి పథకం సామాజిక సమ్మిళితాన్ని, పట్టణ జీవనోపాధులను ఎలా బలోపేతం చేసింది?**

లబ్ధిదారులలో దాదాపు 46 శాతం మంది మహిళలు కాగా, సుమారు 70 శాతం మంది అట్టడుగు వర్గాలకు చెందినవారు. ఈ పథకం సూక్ష్మ పరిశ్రమలను, స్థానిక సరఫరా గొలుసులను బలోపేతం చేయడంతో పాటు, వ్యాపారులను పట్టణ స్థానిక సంస్థలతో అనుసంధానించింది.

## రాష్ట్రవ్యాప్తంగా "నవచేతన" బాల్యారంభ అభివృద్ధి

# స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభం



**అమరావతి, (భారత శక్తి):** ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి (ఇజీతీశ్రీ౦ అప్తతిశ్రీటప్తనీటీ ఆవలవశ్రీనీజూఎవనిబి - ఇఅఅ) మరియు అభివృద్ధి స్క్రీనింగ్‌పై రాష్ట్రవ్యాప్త సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి సెకనుకు దాదాపు 10 లక్షల న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయని తెలిపారు. పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయస్సులోపు, 90 శాతం ఆరు సంవత్సరాల వయస్సులోపు పూర్తవుతుందని వివరించారు. ప్రారంభ సంవత్సరాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత మరియు ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత మరియు శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని మంత్రి గారు పేర్కొన్నారు. బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యాలు చేపట్టేందుకు స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య మరియు ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సాధనం 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. నవచేతన వేదిక ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలలో స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞాన వికాసం మరియు సామాజిక-భావోద్వేగ అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను వ్యవస్థీకృతంగా పరిశీలించగలరని తెలిపారు. దీని ద్వారా అదనపు మద్దతు లేదా ముందస్తు జోక్య సేవలు అవసరమయ్యే పిల్లలను త్వరగా గుర్తించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా రాష్ట్రస్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణను మే 29, 30 తేదీలలో నిర్వహించినట్లు, జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు జూన్ 2, 3 తేదీలలో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలకు జూన్ 5 నుండి 10 వరకు భారీ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు జిల్లా అధికారులు, సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అభివృద్ధి మైలురాళ్ల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, వయస్సుకు అనుగుణమైన స్క్రీనింగ్ నిర్వహించడం, అభివృద్ధి ఆలస్యాలు మరియు వైకల్యాలను గుర్తించడం, ముందస్తు రిఫరల్ మరియు జోక్యాలను ప్రోత్సహించడం, కుటుంబ స్థాయిలో పోషణాత్మక సంరక్షణ పద్ధతులను బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. స్క్రీనింగ్ అనంతరం కుటుంబాలకు మద్దతుగా వాట్సాప్ సందేశాలు, వీడియోలు, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఎఖీూ), అలాగే నెట్‌వర్క్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ముద్రిత కౌన్సెలింగ్ మరియు కార్యాచరణ కార్డుల ద్వారా తల్లిదండ్రులకు వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు ఇంటి వద్దనే స్పందనాత్మక సంరక్షణ, ఆటలు, సంభాషణ, పోషణ మరియు ప్రారంభ అభ్యసన కార్యక్రమాల ద్వారా పిల్లల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా తోడ్పడగలరని తెలిపారు. "ప్రతి చిన్నారి విలువైనవాడు" అనే నమ్మకంతో ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధిలో పెట్టుబడి పెడుతోందని, నవచేతన కార్యక్రమం ద్వారా అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న ఏ చిన్నారి కూడా గుర్తించబడకుండా మిగలకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "పిల్లలే మన గొప్ప సంపద. తొలి 1,000 రోజులు జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తాయి. ఈ రోజు ముందస్తు గుర్తింపు, పోషణాత్మక సంరక్షణ మరియు తల్లిదండ్రుల సాధికారతలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన, అభివృద్ధి చెందిన స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేస్తున్నాము" అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

# వైద్య విజ్ఞానానికి వేదికగా 'అపోలోసర్జ్ 2026'

### - రోబోటిక్ సర్జరీ, ట్రాన్స్‌ప్లాంట్లపై నిపుణుల అవగాహన





**చిత్తూరు, (భారత శక్తి)** శస్త్రచికిత్స రంగంలో వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు, రోబోటిక్ సర్జరీలు, అవయవ మార్పిడి, లాపరోస్కోపిక్ విధానాలపై వైద్యులకు అవగాహన లక్ష్యంతో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లో నిర్వహించిన 'అపోలోసర్జ్2026 షార్పెనింగ్ సర్జికల్ మైండ్స్' నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) గురువారం ఘనంగా జరిగింది. జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో దేశంలోని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు పాల్గొని వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, వైద్యులకు తాజా వైద్య పరిజ్ఞానాన్ని అందించారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, వైస్ ఛాన్సలర్ డిజిగ్నేట్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ల్క్లాడ్ జె. ఆగస్టిన్, అసోసియేట్ డీన్ (అకడమిక్స్) డాక్టర్ రమ్య రామకృష్ణన్, ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ ఐ.వి. రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ అపోలో నాలెడ్జ్ సిటీ ఆవిర్భావం, అభివృద్ధి, వైద్య విద్యా రంగంలో సాధించిన పురోగతిని వివరించారు. ఆధునిక వైద్య విద్య, పరిశోధనలు, ఆరోగ్య సేవల విస్తరణలో అపోలో నాలెడ్జ్ సిటీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్ మాట్లాడుతూ వైద్య రంగంలో నిరంతర అభ్యాసం, పరిశోధనలు, నూతన సాంకేతికతల అనుసరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని, తద్వారా చికిత్స ఫలితాలను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అన్నారు. సైంటిఫిక్ సెషన్లలో దేశంలోని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. అపోలో హాస్పిటల్స్ చెన్నైకి చెందిన డాక్టర్ రాజ్ పలనియప్పన్ రోబోటిక్ సర్జరీ సూత్రాలను వివరించగా, అపోలో ఇంద్రప్రస్థ హాస్పిటల్స్, న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ అజయ్ కుమార్ శర్మ మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సల్లో అనుసరించాల్సిన ఆధునిక విధానాలపై ప్రసంగించారు. అపోలో హాస్పిటల్ గ్రూప్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ మురళీధరన్ ఎం. అక్యూట్ ప్యాంక్రియాటైటిస్‌లో తాజా చికిత్సా విధానాలను వివరించగా, తిరుపతి స్విమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి ప్యాంక్రియాటైటిస్ నిర్ధారణలో ఇమేజింగ్ సాంకేతికతల పాత్రను వివరించారు. అపోలో హాస్పిటల్స్ చెన్నైకి చెందిన డాక్టర్ కుముద్ కుమార్ ధితాల్ గుండె మార్పిడి శస్త్రచికిత్సలలో తాజా పురోగతిని వివరించగా, డాక్టర్ మీరా రాఘవన్ రోబోటిక్ పెల్విక్ సర్జరీలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించారు. డాక్టర్ కలయరసన్ క్లిష్టమైన హెపాటో-బిలియరీ, ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలపై విశ్లేషణాత్మక ఉపన్యాసం అందించారు. మధ్యాహ్నం జరిగిన ప్యానెల్ చర్చలో డాక్టర్ వై. ముత్తేశ్వరయ్య (స్విమ్స్), డాక్టర్ కొండారెడ్డి (ఎఐఎంఎస్ఆర్), డాక్టర్ వై. రామకృష్ణ (ఎఐఎంఎస్ఆర్) పాల్గొని అబ్స్ట్రక్టివ్ జాండిస్ చికిత్సలో ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కారాలపై చర్చించారు. అనంతరం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కేస్ ప్రెజెంటేషన్లు నిర్వహించగా, నిపుణులు విలువైన సూచనలు అందించారు. సాయంత్రం నిర్వహించిన లాపరోస్కోపిక్ ఎండోట్రైనర్ హ్యాండ్స్-ఆన్ స్కిల్ వర్క్‌షాప్ విశేష ఆకర్షణగా నిలిచింది. ఇందులో పాల్గొన్న యువ వైద్యులు ఆధునిక లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలపై ప్రత్యక్ష శిక్షణ పొందారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై. రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్. ఉదయ్ కుమార్, రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలు, ఆసుపత్రుల నుంచి వచ్చిన వైద్యులు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్‌డరోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి
- గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు గ్రామంలో ఉన్న బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు కృషి చేయలి
- మాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి
- తంగళ్ళపల్లి మండలం తడూర్ గ్రామ సభలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**రాజన్న సిరిసిల్ల(భారత శక్తి) :** ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షితమైన, శాంతియుతమైన సమాజ నిర్మాణం సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్ళపల్లి మండలం తడూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామస్తులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకొని పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌డరోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నరు. వాహనదారులు తమ స్వీయారక్షణార్థం,కుటుంబ క్షేమం కొసం తప్పని సరిగా హెల్మెట్ సిట్ బెల్ట్ ధరించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నపడం, ర్యాష్ డ్రైవింగ్,రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయవద్దని,మైనర్ డ్రైవింగ్ పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు గ్రామాల్లో ఉన్న రహదారి భద్రతా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీల పాత్ర కీలకమని తెలిపారు. మహిళలు, యువతులు, బాలికలు జిల్లా షి టీమ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్కూల్, కాలేజ్,పని చేసే ప్రదేశాల్లో మహిళలు విద్యార్థినులు ఏమైనా ఇబ్బందులు ఎదురుకుంటే నిర్భయంగా షి టీమ్ నంబర్ 87126 56425 నంబర్ ని సంప్రదించాలని సూచించారు. భరోసా కేంద్రం ద్వారా లీగల్, వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్ సేవలు అందిస్తారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తు మాధకద్రవ్యాల నిర్ములనలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఉపేందర్ చారి, వివిధ శాఖల అధికారులు,గ్రామ సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్ళు పై బ్రహ్మంగారి మఠంలో నిరసన కార్యక్రమం

### వైసిపి మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం



**బ్రహ్మంగారి మఠం (భారత శక్తి)** బి.మఠం ఉప మండలాధ్యక్షుడు కూనపులి రాజా నాయుడు,ఉపాధ్యక్షులు ఎత్తపు సుబ్బారెడ్డి,సోమిరెడ్డిపల్లె శివారెడ్డి, ఎంపీటీసీ మనోహరాచారి,దుగ్గిరెడ్డి,మాజీ డీలర్ రేకలగుంట గంగి నాయుడు,తిప్పన నాగార్జున నాయుడు,మండల బీసీ సెల్ అధ్యక్షులు బండి సుబ్బరాజా,జోగయ్య, గంగిరెడ్డిపల్లి కృష్ణారెడ్డి,నియోజవర్గ విద్యార్థి విభాగ నాయకులు బాలకృష్ణారెడ్డి,మండలంలోని పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున పాల్గొన్న వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'పెద్ది' - మూవీ రివ్యూ!




చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు తెరకెక్కించిన సినిమానే 'పెద్ది'. ఈ కథపై కసరత్తు చేయడానికి బుచ్చిబాబు చాలా కాలమే కష్టపడ్డాడు. బుచ్చిబాబుపై నమ్మకంతో చరణ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి కూడా చాలా సమయమే తీసుకున్నాడు. స్పోర్ట్స్ డ్రామాతో కూడిన కంటెంట్ కావడం, చరణ్ - జాన్వీ కలిసి తొలిసారిగా నటించిన సినిమా కావడంతో సహజంగానే అందరిలో ఆసక్తి పెరిగింది. ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన బాణీలకు మంచి రెస్పాన్స్ రావడంతో అంచనాలు పెరిగాయి. అలాంటి అంచనాల మధ్య ఈ రోజు (జూన్ 4)న ఈ సినిమా థియేటర్లకు వచ్చింది. 'విజయనగరం' జిల్లా పరిధిలోని కొండకింద ఊరు అది. అందువలన అందరూ దానిని 'కొండకింద ఊరు' అనే పేరుతోనే పిలుస్తుంటారు. అంతకు మించి ఆ ఊరుకంటూ ఒక పేరు లేదు. 450 కుటుంబాల వారు కలిసి నివసించే ఈ ఊరులో ఎవరికీ ఓటు హక్కు అనేది లేదు. ఆ ఊరు మీదుగా వెళ్లే ట్రైన్ అక్కడ ఆగదు. ఎంతదూరమైనా వాళ్లు కాలిబాటలో వెళ్లాల్సిందే. ఆ ఊళ్లో రైలు ఆగేలా చేయడం కోసం, 30 ఏళ్లుగా 'అప్పల సూరి' (జగపతిబాబు) ప్రయత్నిస్తూ ఉంటాడు. గవర్నమెంటు ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉంటాడు. కొండకింద ఊరుకి చెందిన యువకుడే 'పెద్ది'. తన తల్లితో కలిసి అతను అక్కడ నివసిస్తూ ఉంటాడు. 'బెల్లం బట్టీ'లో పనిచేసే పెద్ది, 'ఆటకూలి'గా క్రికెట్ ఆడుతూ ఉంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో అతనితో సమానమైన ఆటగాడు లేడని అంతా చెప్పుకుంటూ ఉంటారు. అది ఆ ప్రాంతంలోని కలవారి కుటుంబాలకు చెందిన యువకులకు అసూయగా కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆ ప్రాంతంలో రాజకీయనాయకుడైన సుభద్రరాజు (రావు రమేశ్) కూతురైన అచ్చియమ్మ (జాన్వీ కపూర్)పై 'పెద్ది' మనసు పారేసుకుంటాడు. కొండకింద ఊరులో రైలు ఆగేలా చేయడం కోసం 'సూరి' ప్రాణత్యాగం చేస్తాడు. అతని మరణం పెద్దిని కలవరపెడుతుంది .. ఆలోచింపజేస్తుంది. ఒక మనిషికైనా .. గ్రామానికైనా గుర్తింపు ఎంత అవసరమనేది అతనికి అర్థమవుతుంది. తన గ్రామానికి గుర్తింపు రావాలంటే ముందుగా తాను గుర్తింపును సంపాదించుకోవాలి. అది జరగాలంటే తాను ఎంచుకున్న రంగంలో తాను గెలవాలి అని నిర్ణయించుకుంటాడు. అందుకోసం పెద్ది చేసే పోరాటమే ఈ సినిమా కథ. పాతికేళ్లకే పాతబడి పోవద్దు.. చేసేదేమైనా ఉంటే ఇప్పుడే చేసేయి .. నిదానంగా చేయొచ్చులే అని తాపీగా కూర్చోవడానికి మళ్లీ పుడతామా ఏంటి? అనే ఆలోచనా విధానంతో ఉండే ఒక కొండ ప్రాంతానికి చెందిన యువకుడి కథ ఇది. ఆట అనేది డబ్బుల కోసం కాదు .. పేరు కోసం ఆడాలి. అప్పుడే అది తన ఊరుకి కూడా గుర్తింపును తెస్తుందని తెలుసుకుని, ఆ దిశగా పోరాటాన్ని సాగించిన ఒక యోధుడి కథ ఇది. దర్శకుడు బుచ్చిబాబు ఈ స్పోర్ట్స్ డ్రామాలో మూడు ఆటలను టచ్ చేశాడు. క్రికెట్ .. కుస్తీ .. పరుగు పందాలను చూపిస్తూ వెళ్లాడు. నిజానికి ఒక కథలో ఈ మూడు అంశాలను ఆసక్తికరంగా ఆవిష్కరించడం కత్తిమీద సాముపంటిదే. అయినా భారీస్థాయిలో అందుకు సంబంధించిన సన్నివేశాలను ఆవిష్కరిస్తూ వెళ్లాడు. ఎమోషనల్ గా కనెక్ట్ చేస్తూ వెళ్లాడు. అయితే ఉన్న సమయమంతా ఆటలకే సరిపోవడంతో, లవ్ .. రొమాన్స్ .. ఇతర వినోదపరమైన అంశాలకు చోటు లేకుండా పోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. బుచ్చిబాబు చేసిన మరో సాహసం ఏమిటంటే ఒక పవర్ఫుల్ విలన్ అంటూ లేకుండా, కథానాయకుడి చుట్టూ ఉన్న పరిస్థితులనే విలన్ గా చూపిస్తూ వెళ్లడం. దాంతో హీరోకి ఏ వైపు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనే ఒక టెన్షన్ లేకుండా ఆడియన్స్ కూల్ గా చూస్తుంటారు. ఇక జాన్వీ కపూర్ పాత్ర తెరపై అక్కడక్కడా కాకుండా, అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తుంది. ఆమె పాత్రపై ఏ మాత్రం ఫోకస్ పెట్టకపోవడం కనిపిస్తుంది. ఐటమ్ సాంగ్ కి ముందు .. వెనుక అన్నట్టుగా ఉంటుంది ఆమె పాత్ర ధోరణి. హీరోతో ప్రేమ వ్యవహారం పెద్దగా ముదరకుండానే, ఆమె అతని పేరు చెప్పి 'తాళి' కట్టేసుకోవడం ప్రేక్షకులు బిత్తరపోయేలా చేస్తుంది. రావు రమేశ్ లాంటి ఆర్టిస్టు కూడా, తెరపై ఆమె తండ్రి అనిపించుకుని వెళ్లిపోవడం ఆశ్చర్యం. తెరపై అప్పటికప్పుడు పుట్టుకొచ్చి ఆ తరువాత అదృశ్యమైపోయే పాత్రలు చాలానే కనిపిస్తాయి. ఒకటి రెండు చిన్న పాత్రలను హైలైట్ చేసిన బుచ్చిబాబు, మరికొన్ని ముఖ్యమైన పాత్రలను వదిలేశాడు. చరణ్ పాత్రను డిజైన్ చేసిన విషయంలో మాత్రం ఆయనను అభినందించవలసిందే. చరణ్ ఎంతగా కష్టపడ్డాడనేది మాత్రం ప్రతి ఫ్రేమ్ చెబుతూనే ఉంటుంది. ఇక ఆ తరువాత స్థానంలో జగపతిబాబు .. శివరాజ్ కుమార్ పాత్రలు మినహా ఎవరూ పెద్దగా ప్రభావితం చేయలేకపోయారు. శ్రుతి హాసన్ స్పెషల్ సాంగ్ విజిల్స్ కొట్టించలేకపోయింది. నిర్మాణ విలువలు బాగున్నాయి. తెరపై రత్నవేలు ఆవిష్కరించిన దృశ్యాలు ఆకట్టుకుంటాయి. ఏఆర్ రెహ్మాన్ సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలం అనే చెప్పాలి. నవీన్ నూలి ఎడిటింగ్ కూడా మంచి మార్కులు కొట్టేస్తుంది. యాక్షన్ సీక్వెన్స్ ను డిజైన్ చేసిన తీరు .. కొరియోగ్రఫీ గొప్పగా అనిపిస్తాయి. సందర్భాను సారంగా అక్కడక్కడా కొన్ని డైలాగులు మనసును పట్టుకుంటాయి. 'నీకంటూ ఒక గుర్తింపు దక్కాలంటే నీ గెలుపు కనిపించాలి . లేదంటే ఆ గెలుపు శబ్దం వినిపించాలి. అంతవరకూ నువ్వు పరిగెడుతూనే ఉండాలి' అనే ఒక సందేశాన్ని ఇచ్చిన తీరు బాగుంది. అయితే ఆటలకి సంబంధించిన కోటా పెరిగి పోయి, లవ్ .. రొమాన్స్ .. మాస్ ఆడియ న్స్ ఆశించే వినోదం వాటా తగ్గడం కాస్త అసం తృప్తిని కలిగిస్తుంది. ఫ్యామిలీ ఆడియన్స్ మొగ్గు చూపితే, చరణ్ పడిన కష్టం ఫలించినట్టే అవుతుంది.

## డాక్టర్ బయోపిక్‌లో సూర్య?



ఇటీవల విడుదలైన 'కరుప్పు'తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు తమిళ అగ్ర హీరో సూర్య. ఇప్పటికే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 300కోట్ల మైలురాయిని దాటింది. గత కొంతకాలంగా సరైన విజయాలు లేక సతమతమవుతున్న సూర్య కెరీర్‌కు 'కరుప్పు' మంచి ఊపునిచ్చింది. ఈ నేపథ్యంలో సూర్య కొత్త సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. తనకు 'జై భీమ్' వంటి క్లాసిక్ చిత్రాన్ని అందించిన దర్శకుడు టీజే జ్ఞానవేల్‌తో సూర్య మరో సినిమా చేయబోతున్నారని గతకొంతకాలంగా వార్తలొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఇదొక డాక్టర్ బయోపిక్ అని తెలిసింది. చెన్నైలో ఛాతీ వైద్యుల నిపుణుడిగా, పేదల పాలిట పెన్నిధిగా ప్రసిద్ధికెక్కిన డాక్టర్ కృష్ణ వరదాచారి తిరువేంగడం జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కేవలం 5 రూపాయల ఫీజుతో పేదప్రజలకు వైద్యాన్నందించి సేవా గుణాన్ని చాటుకున్నారు డాక్టర్ కృష్ణ వరదాచారి. వైద్యపరంగా ఆయన సేవలకుగాను పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆరేళ్ల క్రితం కన్నుమూసిన ఈ లెజండరీ డాక్టర్ జీవితంలోని ముఖ్యఘట్టాలను తీసుకొని సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. త్వరలో సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడుతుందని సమాచారం.

## తండ్రి తాలూకు ప్రపంచం



రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ఆధ్యాత్మిక భావాల్ని ప్రతిబింబించే టైటిల్‌తో తండ్రీకూతుళ్ల అనుబంధం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటమే అందుక్కారణం. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. బుధవారం 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో గ్లింప్స్‌ను విడుదల చేశారు. కూతురే ప్రపంచంగా బతికే తండ్రీ, వారిద్దరి మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ హృద్యంగా సాగింది. అయ్యప్పదీక్ష తాలూకు విజువల్స్ భావోద్వేగభరితంగా అనిపించాయి. యాక్షన్ ఎలిమెంట్స్ కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఓ తండ్రి తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ గ్లింప్స్ హార్ట్‌టచింగ్‌గా సాగింది. ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.

## ఇప్పటివరకూ రాని కథ!



లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న సంగీతప్రధాన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్నారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపూడి ప్రధాన పాత్రధారులు. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక అహల్యా బమ్రూ విలేకరులతో ముచ్చటించింది. తన నేపథ్యం గురించి చెబుతూ 'మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ భాషలు మాట్లాడే ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నా ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ చూసి నాగ్‌అశ్విన్ సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను' అని చెప్పింది. ఈ సినిమాలో తాను బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో విలన్ క్యారెక్టర్‌లో కూడా అమ్మాయే నటించిందని తెలిపింది. 'కథాపరంగా కూడా ఇది కొత్త జోనర్ సినిమా. ఇలాంటి కథను ఇంతవరకు చూసి ఉండరు. తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం ఆనందంగా ఉంది. మహేష్‌బాబు నా ఫేవరేట్ హీరో. యాక్షన్ సినిమాలు చేయాలన్నది నా డ్రీమ్' అని అహల్యా బమ్రూ చెప్పింది.

## గండికోటలో 'రణబాలి'



అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. రష్మిక మందన్న కథానాయిక. రాయలసీమ నేపథ్యంలో జరిగే ఈ కథలో విజయ్ దేవరకొండ 19వ శతాబ్దం నాటి చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా ఆయన పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ గుర్రపుస్వారీలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఏపీలోని వైఎస్ఆర్ కడప జిల్లా గండికోటలో జరుగుతున్నది. కోట ముఖద్వారం, ధాన్యాగారంలో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవారం రోజుల పాటు అక్కడే షూటింగ్ జరుగుతుందని తెలిసింది. 'రణబాలి' సెప్టెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

## థియేటర్లలో రూ.1800 కోట్ల కలెక్షన్లు.. ఈరోజే ఓటీటీలోకి 'ధురంధర్ 2!




ఇండియన్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో రూ. 1800 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో సంచలన విజయం సాధించిన ఈ చిత్రం, ఈరోజు సాయంత్రం నుంచే డిజిటల్ వేదికపైకి రానుంది. భారత్‌లో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జియో హాట్‌స్టార్' వేదికగా ఈ రోజు రాత్రి 7 గంటలకు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ ప్రదర్శితం కానుంది, అలాగే జూన్ 5 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉంటుంది. థియేటర్లలో కట్ చేసిన కొన్ని సీన్స్, అన్‌ఫిల్టర్డ్ డైలాగ్స్‌తో కూడిన ప్రత్యేక వెర్షన్ కట్‌ను భారత్‌లో జియో హాట్‌స్టార్ స్ట్రీమింగ్ చేస్తుండటం విశేషం. దీనికి ముందు సాయంత్రం ఒక 30 నిమిషాల బిహైండ్-ది-సీన్స్ ప్రీ-షో కూడా ఉండనుంది. ఇక విదేశాల్లోని సినీ అభిమానుల కోసం ఈ మూవీ ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. ఆదిత్య ధార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హై-వోల్టేజ్ స్పై థ్రిల్లర్‌లో రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించారు. థియేటర్లలో మిస్ అయిన వారు లేదా మరోసారి ఈ యాక్షన్ విజువల్ ఫీస్ట్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారు ఈరోజు సాయంత్రం నుంచి ఓటీటీలో చూసేయొచ్చు.

## మంజీరా నదిలో ఇసుక వివాదం ..ఉద్రిక్తత

**బోధన్(భారత శక్తి)** తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులో ఇసుక వివాదం చెలరేగింది. మంజీరా నదిలోని ఇసుక వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. మహారాష్ట్ర సరిహద్దులోని బోలేగావ్ చెందిన ఇసుక వాహనాలను బోధన్ పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ భూభాగంలోనికి చొచ్చుకొని వచ్చి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని స్థానికుల ఆరోపణతో పోలీసులు మహారాష్ట్ర వాహనాలను అడ్డుకున్నారు.

## ఫార్మా పనులను అడ్డుకున్న రైతులు

**రంగారెడ్డి(భారత శక్తి)** యాచారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో జరుగుతున్న ఫార్మా పనులను రైతులు అడ్డుకున్నారు. అక్రమంగా ఫార్మా భూముల్లో చదును చేసేందుకు గ్రామానికి పదుల సంఖ్యలో వచ్చిన జేసీబీలు, డోజర్లను అడ్డుకొని కోర్టు స్టే ఉన్న భూముల్లో ఎలాంటి పనులు చేయొద్దని వెనక్కి పంపారు. గ్రామానికి చెందిన చిట్టి నాగమణి అనే మహిళా రైతు ఫార్మాకు భూమిని ఇవ్వలేదు. సర్కార్ నుంచి పరిహారమూ తీసుకోలేదు.. పోలీసుల సహకారంతోఅధికారులు బలవంతంగా భూమిని చదునుచేస్తున్నారని స్థానికుల ఆరోపణ. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి జేసీబీలు, డోజర్లు పొలాలకు రాకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులతో వాగ్వాదం జరిగింది.

## రాష్ట్రవ్యాప్తంగా వైకాపా నిరసనలు

**విజయవాడ(భారత శక్తి)** చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో వైకాపా రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. గురువారం నాడు మండల కేంద్రాల్లో టీడీపీ మేనిఫెస్టో, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంతకాలతో ఇచ్చిన బాండ్లు దహనం, 8 లేదా 9 తేదీలలో టౌన్ హాల్ సదస్సులు, 12న నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తారు.

## విజయ్ వర్సెస్ అన్నామలై...

**చెన్నై,(భారత శక్తి)** తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. మొన్నటి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితా?లే ఇందుకు కారణమని చెప్పాలి. ఈ ఎన్నికల్లో కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ స్థాపించిన తమిళ వెట్రిగ కజగం (టీవీకే) రెండు పెద్ద పార్టీలను చిత్తు చేసి అధికార పార్టీగా అవతరించిన తీరు ఈ ఆసక్తిని మరింతగా పెంచింది. ఈ ఆసక్తి ఎక్కడిదాకా వెళ్లిందంటే? తమిళనాడు అసెంబ్లీకి 2031లో జరిగే ఎన్నికల సమీకరణాల వరకూ వెళ్లిపోయింది. 2031లో జరిగే తమిళ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ విజయ్ వర్సెస్ అన్నామలై అంటూ ఆసక్తికర విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ఈ విశ్లేషణలు ఎంతమేర కార్యరూపం దాలుస్తాయన్న దానిపైనా ఇప్పుడు ఆసక్తికర చర్చలు జరుగుతున్నాయి. తమిళనాడు నూతన సీఎం విజయ్ ఎన్నికలకు రెండేళ్ల ముందుగానే రాజకీయ పార్టీని ప్రకటించి? రెండేళ్ల పాటు ప్రజల్లో తిరిగారు. అప్పటికే తనకున్న స్టార్ డమ్ ను, ఫ్యాన్ ఫాలోయింగ్ ను చక్కగా వినియోగించుకున్న విజయ్? ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ విజయానికి దివంగత నేతలు కరుణానిధి, జయలలితల మరణాలతో ఏర్పడిన రాజకీయ శూన్యతను సద్వినియోగం చేసుకోవడంలో విజయ్ సఫలమయ్యారు. 2031 నాటికి విజయ్ పార్టీ ఓ ప్రధాన పోటీదారుగా అయితే ఉంటుందని పక్కాగా చెప్పవచ్చు.ఇక బీజేపీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమైపోయిన అన్నామలై విషయానికి వస్తే.. అసలు ఆయన రాజకీయ ప్రయాణం ఎలా అన్న దానిపై ఇప్పటిదాకా స్పష్టతే లేదని చెప్పాలి. ఓ ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న అన్నామలై? తన సివిల్ సర్వెంట్ పదవికి రాజీనామా చేసి మరీ?రాజకీయాల్లోకి వచ్చారు. వచ్చీరాగానే బీజేపీ బాటలో నడిచిన ఆయన? బీజేపీ తమిళనాడు అధ్యక్షుడి హోదాలో పలు కీలక కార్యక్రమాలకు దిగారు. బహిరంగంగా తనను తాను కొరడాతో కొట్టుకుని నిరసన వ్యక్తం చేసిన అన్నామలై దేశవ్యాప్తంగా అయితే గుర్తింపును దక్కించుకున్నారు. అయితే ఆయన భవిష్యత్తు రాజకీయ చిత్రం ఏమిటన్నది ఇప్పటికీ తెలియదనే చెప్పాలి.అన్నామలై బీజేపీని వీడే దిశగా సాగుతూ ఉంటే? ఆయనను పార్టీలోనే నిలుపుకునే దిశగా కమలం పార్టీ యత్నిస్తోంది. అయినా బీజేపీని వీడినా అన్నామలై? విజయ్ స్థాయిలో ప్రజాదరణను చూరగొంటారన్న గ్యారెంటీ అయితే లేదు. ఎందుకంటే? ఇప్పటికే ఓ రాజకీయ పార్టీలో పనిచేసిన ఆయన ఆ పార్టీని వీడి బయటకు వచ్చేందుకు యత్నిస్తూ? రాజకీలపై తనకు ఇంకా స్పష్టత రాలేదన్న విషయాన్ని తనకు తానుగానే బయటపెట్టుకున్నారు. విజయ్ కి కోట్లాది మంది ఫ్యాన్స్ ఓట్లు వేసి, వెయించి ఆయనకు గెలుపును అందిస్తే? ఆ స్థాయిలో అన్నామలైకి ఓట్లు వేసి, వేయించే వారు ఎవరన్నది ప్రశ్నార్థకం. వెరసి విజయ్ తో అన్నామలై పోలిక అసలు కుదరదని చెప్పాలి. అంతేకాకుండా? విజయ్ కి ఆయన ప్రధాన ప్రత్యర్థి అవుతారన్నది దాదాపుగా సాధ్యం కాదని చెప్పాలి.

### ముందే చెప్పిన అన్నామలై

2024 లోక్ సభ ఎన్నికల సమయంలో అన్నామలై మాట్లాడుతూ.. 2026లో తమిళనాడు ఏ ఒక్క పార్టీ సొంతంగా అధికారంలోకి రాలేదని అంచనా వేశారు. ఆయన అంచనాలకు దగ్గరగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆప్షన్-ఏ కింద తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని అంచనా వేసిన అన్నామలై.. ఆప్షన్-బి కింద బీజేపీ గనుక వచ్చే రెండేళ్లపాటు శ్రమించి క్షేత్రస్థాయిలో నాయకులను తీర్చిదిద్దితే.. 500 రోజుల ముందు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తే.. 2026లో ప్రజలు తమవైపు మొగ్గు చూపుతారని ఆయన అంచనా వేశారు.బీజేపీ పెద్ద రిస్క్ తీసుకొని.. ఎన్నికల నోటిఫికేషన్ అమల్లోకి రావడానికి 500 రోజుల ముందు అభ్యర్థులను ప్రకటిస్తే.. తమిళనాడులో బీజేపీకి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని అన్నామలై 2024లోనే వ్యాఖ్యానించారు.అన్నామలై చెప్పినట్లు 2026 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా లేదా.. 2024 ఎన్నికల తరహాలోనే చిన్న పార్టీలతో కలిసి పోటీ చేసి 5-6 సీట్లు గెలుచుకున్నా సరే.. ఇప్పుడు తమిళనాడు ముఖచిత్రం మరోలా ఉండేదని చెప్పొచ్చు. ఒకవేళ ఒక్క సీటు గెలవలేకపోయినా సరే, 10 శాతానికి అటు ఇటుగా ఓట్లు సాధిస్తే మరుసటి ఎన్నికల నాటికి బీజేపీ పరిస్థితి ఆశాజనకంగా ఉండేది. అయితే బీజేపీ అధినాయకత్వం ఆయన మాటలను పరిగణనలోకి తీసుకోలేదు. అన్నాడీఎంకేతో పొత్తుకే ప్రాధాన్యం ఇచ్చింది. ఈపీఎస్ డిమాండ్‌తో అన్నామలైను పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. పళనిస్వామి పేరు కూడా ఎత్తకుండా అన్నామలై ట్వీట్ చేశారు.జాతీయ పార్టీ అయిన బీజేపీకి కొన్ని సమస్యలు కూడా ఉంటాయని అన్నామలైకు తెలుసు. తమిళనాడులో ద్రవిడ వాదంతోపాటు బీజేపీ పట్ల వ్యతిరేకత కూడా ఎక్కువే. అందుకే బీజేపీ నాయకుడిగా జనంలోకి వెళ్లడం కంటే.. సొంత పార్టీ పెట్టుకుని జాతీయవాద దృష్టి, లౌకిక భావనలతో ముందుకెళ్తే తనకు సొంతంగానే ఎదిగే అవకాశం ఉందని అన్నామలై భావించి ఉండొచ్చు. 41 ఏళ్ల తాను మరో పదేళ్లు కష్టపడితే పార్టీని అధికారంలోకి తీసుకురావడం కష్టం కాదనే అంచనాతోనే ఆయన సొంత పార్టీవైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే డీఎంకేను దెబ్బతీసి విజయ్ నాయకత్వంలోని టీవీకే అధికారంలోకి రాగా.. మూడో స్థానానికి పరిమితమైన అన్నాడీఎంకేను అన్నామలై దెబ్బకొట్టే అవకాశం ఉంది.

## తెరపైకి నీటి కుంటలు

**నిజామాబాద్, (భారత శక్తి)**12 లక్షల లీటర్ల నిల్వ.. 20 మీటర్ల వెడల్పు.. 20 మీటర్ల పొడవు.. 3 మీటర్ల లోతుతో నీటి కుంట నిర్మించుకుంటే సుమారు 12 లక్షల లీటర్ల నీరు నిల్వ చేసుకోవచ్చు. ఇందుకు ఉద్యానశాఖ 50 శాతం రాయితీ ఇస్తోంది. కష్టకాలంలో బిందు సేద్యం ద్వారా పంటలకు నీటి తడులు అందించొచ్చు. తద్వారా దిగుబడులు పెంచుకోవచ్చు. బోరు బావులపై భారాన్ని తగ్గించొచ్చు. సిల్పాలిన్ షీట్తో కుంటకు లైనింగ్ చేసుకోవడం ద్వారా నీటి లీకేజీని అరికట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేసుకోవచ్చు.ఖరీఫ్ పంటల సాగుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు వెంటనే నీటి కుంటలు తవ్వుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాధారంగా పంటలు పండించే మెట్ట ప్రాంతాల్లో ఇవి కీలకంగా ఉంటాయని చెబుతున్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మిరప, పసుపు ఇలా... దీర్ఘకాలం సాగులో ఉండే ఈ పంటలకు నీటి తడులు తరచూ అందించాల్సి ఉంటుంది. చాలాచోట్ల నీటి వనరులు అందుబాటులో లేని కారణంగా కొంతమంది రైతులు ఉద్యాన పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటివారికి తక్షణ ఉపాయంగా నీటి కుంటలను సూచిస్తోంది ఉద్యానశాఖ.ఎందుకంటే... నిర్దేశిత పరిమాణంలో నీటి కుంటలను తవ్వుకోవడం వల్ల సాగునీటి ఇబ్బందులుండవు. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉన్నందున రైతులు దృష్టి సారించొచ్చు. కుంటల పరిమాణం ఆధారంగా రాయితీలు వినియోగించుకోవచ్చు. మిర్చి సాగులో కీలక దశలో ఒక్క తడి అందించకపోయినా దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు కిలోమీటర్ల దూరం నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకున్న ఘటనలెన్నో ఉన్నాయి. బోధన్ మండలంలోని పెగడపల్లి, భూలక్ష్మి క్యాంప్, బర్దిపూర్, సాలంపాడు సాలుర మండలాల్లో ఈ గుంటలో నిర్మిస్తున్నారు.ప్రాంతాల్లో అప్పటికప్పుడు నీటి కుంటలు తవ్విన పరిస్థితులూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేసవిలోనే నీటి కుంటలు తవ్వుకుంటే కాస్త వర్షం కురిసినా.. నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవచ్చు. వర్షాలు కాస్త ఆలస్యమైనా.. కాలువలకు నీటి విడుదలలో జాప్యం జరిగినా.. ఇవి ఉపయోగపడతాయి. పంట కుంటల వల్ల పొలంలో 5 సెంట్ల వరకు సాగుకు ఉపయోగపడదన్న అపోహలో కొంతమంది రైతులున్నారు. వాటి ఆవశ్యకతను గుర్తించాలని జలవనరుల నిపుణులు సూచిస్తున్నారు.

# ఖజానా ఖాళీ...

### - ప్రతి నెలా దాదాపు రూ.18 వేల నుంచి 20 వేల కోట్ల ఖర్చు..

**హైదరాబాద్ (భారత శక్తి)** కాంగ్రెస్ సర్కార్.. తెలంగాణ బండిని నడపలేక దిక్కులు చూస్తోందా? ఏం చేయాలో తోచక ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారా? తెలంగాణ సర్కార్‌కు ఆర్థిక కష్టాలు కొత్త తలనొప్పులు తెస్తున్నాయా? నిధుల లేమితో అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఏకంగా ఆర్థిక శాఖ మంత్రే ఎమ్మెల్యేలతో ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆర్థిక పరిపుష్టికి ఇంకా సమయం పడుతుందని..అప్పటిదాకా కొత్తగా నిధులు ఇవ్వలేమంటూ ఏకంగా ఆర్థిక మంత్రే చేతులెత్తేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఇలా అయితే ఇక ప్రజల్లోకి వెళ్లేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు.తెలంగాణ సర్కార్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. అవును. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఇచ్చిన రిపోర్ట్ ఇదే స్పష్టం చేస్తోంది. లోటు బడ్జెట్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు కాగ్ స్పష్టం చేసింది. హామీల అమలుకు ఆర్థిక స్థితి అడ్డంకిగా మారుతోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇస్తే..వాటిని అమలు చేయడం ఇప్పుడు సర్కార్‌కు సవాల్‌గా మారింది. బడ్జెట్ అంచనాలకు..వాస్తవాలకు పొంతన లేని పరిస్థితి. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వానికి 100 రూపాయలు ఆదాయం వస్తే దాదాపు 108 రూపాయలు ఖర్చు అవుతుంది.

దీని కోసం ప్రతినెల అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో కేవలం రెండున్నర ఏళ్లలోనే 4.14 లక్షల కోట్ల అప్పులను తెచ్చింది సర్కార్. గతంలో ఉన్న అప్పులకు..అసలు, వడ్డీలు కట్టలేక నడ్డి విరుగుతుంటే..మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్లుగా కొత్తగా అవుతున్న లక్షల కోట్ల అప్పులు రేవంత్ ప్రభుత్వానికి గుదిబండగా మారాయి.అటు సంక్షేమాన్ని.. ఇటు అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరాటపడుతుంటే..రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారుతోంది. దీంతో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు?కొత్త కొత్త పనులు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ సర్కార్ ముందుకెళ్తోంది. వాస్తవంగా ప్రతి నెల జీతాలు, పెన్షన్లు, అసలు, వడ్డీల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఇతర చెల్లింపులు అన్ని దాదాపు 18 వేల నుంచి 20 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ వాస్తవ రాబడి మాత్రం కేవలం 16 నుంచి 18 వేల కోట్లలోపే ఉంటుంది. అంటే దాదాపు ప్రతి నెల సగటున రూ.2,250 కోట్ల లోటు సర్కార్ కు సవాల్ గా మారుతోంది.

ప్రభుత్వం శక్తికి మించి కార్యక్రమాల అమలుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టడం.. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసిందన్నట్లుగా తయారైంది పరిస్థితి.ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకో, సంవత్సరానికో పరిస్థితి కుదుట పడుతుందని భట్టి తేల్చి చెప్పడంతో ఎమ్మెల్యేల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ప్రభుత్వం ఎప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతుందో? ఖజానా ఎప్పుడు కళకళలాడుతుందో? అప్పులు తీసుకునే అవసరం తగ్గుతుందో లేదో అనేది చూడాలి.

# ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం రెపరెపలు

- ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఏపీ ప్రకృతి వ్యవసాయం - ఫుడ్ ప్లానెట్ ప్రైజ్ సాధించిన ంఖఅఔఈ...

ప్రకృతి వ్యవసాయంలో ఏపీకి విశిష్ట స్థానం

- దేశానికే గర్వకారణమైన ఈ గౌరవాన్ని మహిళలు, రైతులకు అంకితం చేస్తున్నాం


- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, రైతాంగ అంకితభావానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి (భారత శక్తి)** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పర్యావరణ పురస్కారంగా గుర్తింపు పొందిన 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్?2026' ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ంఖఅఔఈ)కు లభించడం రాష్ట్రానికే కాక దేశానికీ గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అరుదైన అంతర్జాతీయ గుర్తింపుతో ప్రకృతి వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, రాష్ట్ర ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి, రైతులు, గ్రామీణ మహిళల అంకితభావంతో కూడిన కృషికి ప్రపంచ వేదికపై లభించిన గౌరవమే ఈ పురస్కారమని మంత్రి వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, గ్రామీణ మహిళలు, ప్రకృతి వ్యవసాయ ఉద్యమానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ జూన్ 2న స్వీడన్‌లోని బస్తాద్ నగరంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ (ఖీమీూ) కార్యనిర్వాహణ అధికారి తల్లం విజయ్ కుమార్ పాల్గొని ఈ అవార్డును స్వీకరించారు. ప్రపంచ ఆహార వ్యవస్థలో పర్యావరణ అనుకూల మార్పులకు దోహదపడుతున్న వినూత్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద వ్యవసాయ పర్యావరణ కార్యక్రమాలలో ఒకటిగా ఎదిగిందని మంత్రి అన్నారు. ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ంఖఅఔఈ నిరూపించిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, జాంబియా దేశాల్లోనూ అమలవుతుండటం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన విధానం ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమని నిరూపిస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా మహిళల నాయకత్వం ఈ ఉద్యమ విజయానికి ప్రధాన బలంగా నిలిచిందని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులైన గ్రామీణ మహిళలు కుటుంబ స్థాయిలో ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్న 10 వేల మందికిపైగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సేవలు అభినందనీయమని తెలిపారు.

## టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ 20 లక్షలు విరాళం



**తిరుమల (భారత శక్తి)** టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు రూ 20 లక్షలు విరాళం అందింది. క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి దాతలు విరాళం అందజేసారు. హైదరాబాద్ కు చెందిన పురం సంజయ్ బాబు రూ 10 లక్షలు, హామి పెట్స్ అధినేత హనుమర హర్షవర్ధన్ రూ 10 లక్షలు విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్డుసభ్యుడు నన్నపనేని సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 15 డెడ్ లైన్...

**హైదరాబాద్ (భారత శక్తి)**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూటు మార్చారు. ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ పట్ల మెతక వైఖరిని రేవంత్ అవలంబిస్తున్నారన్న అభిప్రాయం ఉండేది. కానీ రానున్న ఏ ఎన్నికల్లోనైనా బీజేపీ తనకు ప్రధాన ప్రత్యర్థిగా భావించిన రేవంత్ రెడ్డి ఆ పార్టీ విషయంలో దూకుడుగా వెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది. రాష్ట్ర నేతలనే తన టార్గెట్ చేసినా నేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని తాకేలా రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఒకింత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించడం కూడా హాట్ టాపిక్ గా మారిందని రాజకీయ విశ్లేషకులు సయితం అభిప్రాయపడుతున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ నేతలకు హెచ్చరిక జారీ చేశారు. పోలవరం కోసం ఏడు తెలంగాణ మండలాలను ఆంధ్రప్రదేశ్ లో కలిపారని, తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర భూములను రెండు వేల ఎకరాలు ఇవ్వలేరా అంటూ మహారాష్ట్రలో ఉన్న బీజేపీ సర్కార్ ను రేవంత్ రెడ్డి నిలదీశారు. ఎన్ని లేఖలు రాసినా మహారాష్ట్ర సీఎం స్పందించడం లేదంటూ తప్పంతా బీజేపీదేనంటూ ఆ పార్టీపై విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం రాష్ట్రం నుంచి డెబ్బయి ఐదు లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటున్నామని, ఆ ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరొక డిమాండ్ కేంద్ర ప్రభుత్వానికి విధించారు.అంతే కాదు సత్రంలో పెట్టే భోజనానికి..నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ అవసరం లేదన్నారు. రాష్ట్రంకొనే పంటను కేంద్రం తీసుకునేలా..కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పంటను కేంద్రం తీసుకోకపోతే జూన్ 15 తర్వాత బీజేపీ ఆఫీసు దగ్గరే తేల్చుకుంటామని రేవంత్ హెచ్చరించారు. అక్కడికే ధాన్యాన్ని తీసుకు వచ్చి పారబోస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అంతే కాదు కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకోకపోతే రాష్ట్రంలో తిరగలేని పరిస్థితి వస్తుందన్నారు. వడ్లు, జొన్నలు, మొక్కజొన్న కొనాల్సిందనని, జూన్ 15 తర్వాత కార్యాచరణ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించడంతో రేవంత్ రూటు మార్చినట్లు కనపడుతుంది.

## ఫ్యూచర్ సిటీ

### ఎకరానికి 1.24 కోట్ల పరిహారం

**హైదరాబాద్ (భారత శక్తి),** తెలంగాణలోని అర్బన్ రీజియన్లలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రభుత్వం రికార్డు స్థాయి పరిహారం చెల్లిస్తోంది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కొంగర ఖుర్ద్, కొంగర కలాన్ గ్రామాల్లో ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే కోసం ఎకరాకు గరిష్టంగా రూ.1.24 కోట్ల భారీ పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించింది. రూ.4,600 కోట్లతో ప్రతిపాదించిన 300 అడుగుల ఈ రహదారి కోసం రెండు దశల్లో మొత్తం 1,500 ఎకరాలను సేకరిస్తున్నారు.తెలంగాణ రాజధాని పరిసర ప్రాంతాలలో, ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవల రాయదుర్గం ఏరియాలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరాకు రికార్డు స్థాయిలో రూ.204 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి భూములను సేకరించడం పెద్ద సవాలుగా మారింది. దీంతో భూసేకరణ ప్రక్రియ సజావుగా.. ఎలాంటి వివాదాలు లేకుండా సాగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రికార్డు స్థాయి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన కొందరు రైతులకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. ఎకరాకు ఏకంగా రూ.1.24 కోట్ల చొప్పున భారీ పరిహారాన్ని అందజేసింది.రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఆనుకుని, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొంగర కలాన్, కొంగర ఖుర్ద్ గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ రేట్లు భారీగా ఉండటంతో జిల్లా యంత్రాంగం రైతులతో పలుమార్లు చర్చలు జరిపింది. చివరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.1.24 కోట్ల రికార్డు స్థాయి పరిహారాన్ని చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లే మార్గంలోని ఇతర లొకేషన్లను బట్టి రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.98 లక్షల వరకు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు.కాగా, రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా ఆమన్‌గల్ వరకు రెండు విడతల్లో దాదాపు రూ.4600 కోట్ల అంచనా వ్యయంతో 300 అడుగుల వెడల్పైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1500 ఎకరాల భూమి అవసరం కానుంది. ఫేజ్-1 కింద 447 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ఫేజ్-2 కింద మరో 558 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల గుండా వెళ్తుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం 1500 ఎకరాల భూమిలో దాదాపు 300 ఎకరాలు అటవీ భూమి కాగా.. మరో 200 ఎకరాలు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీకి రవాణా కనెక్టివిటీ మరింత అద్భుతంగా మారనుంది.

## కూటమి నాయకులు అమరావతిలో ఉండాలి తెలంగాణలో కాదు




**హైదరాబాద్(భారత శక్తి)** ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అంశంపై తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందించారు. ఏపీ కూటమి నాయకులు అమరావతిలో ఉండాలి తెలంగాణలో కాదని అన్నారు. ఆంధ్రా నాయకులు ఏపీకి, తెలంగాణకు మధ్య షటిల్ ట్రిప్స్ వేయడం మానేయాలి. తెలంగాణ గురించి వదిలేసి ఏపీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. పవన్ కళ్యాణ్ తన భాషను మార్చుకోవాలని అయన అన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను
# తక్షణమే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(భారత శక్తి): జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి, మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి, కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు, హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
# బాసర ఐఐఐటీకి ఎంపిక

**- ప్రధానోపాధ్యాయురాలు జి నాగశ్రీ**





మణుగూరు, జూన్ 04 (భారతశక్తి): మణుగూరు ప్రభుత్వ జెడ్ పిహెచ్ ఎస్ కో ఎడ్యుకేషన్ పాఠశాల నుండి 2026 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బాసర ఐఐటికి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ జి నాగశ్రీ గురువారం ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. గంజి జీష్మరమణిక 565 జె వికాస్ 563 అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నుండి పదవ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బాసర ఐఐటీకి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఇంతటి విజయాన్ని కారకులైన ఉపాధ్యాయులను తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

**-అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి.**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 4: జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.. తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు, వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు.




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 4: కోనరావుపేట మండల కేంద్రంలోని ఊరు చివర ఉన్న కాల్వర్టు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఘటన చోటుచేసుకుంది. ఎగ్లాస్పూర్ గ్రామానికి చెందిన వేముల్ల శ్రీనివాస్ సిరిసిల్ల నుంచి ఎగ్లాస్పూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళుండగా, కోనరావుపేట సమీపంలోని కాల్వర్టు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం గాయపడిన శ్రీనివాస్‌ను 108 సిబ్బంది సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన

**- ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం :జిల్లా కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 04 (భారతశక్తి): ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు.

అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, డి ఆర్ డి ఓ విద్యా చందన, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పేరును పునరుద్ధరిస్తేనే
# బి.ఆర్.ఎస్ పార్టీకి మనుగడ..

- **బీఆర్ఎస్ వైఖరిపై ఓయూ విద్యార్థులు, గ్రామీణ ప్రజల తీవ్ర అసంతృప్తి.**
- **పేరు మార్చకుంటే కేసీఆర్ రాజకీయ ప్రస్థానానికే ప్రమాదం.**
- **కల్వకుంట్ల కవితక్క దారిలోనే నడిచి 'తెలంగాణ రాష్ట్ర సమితి'కి జీవం పోయాలి: అల్లంపల్లి రామకోటి..**





హైదరాబాద్, జూన్ 4 (భారత శక్తి ప్రతినిధి): తెలంగాణ సాధించిన ఘన చరిత్ర, ఎందరో అమరవీరుల త్యాగాలు దాగి ఉన్న 'టీఆర్ఎస్' (౧=నా) పేరును 'బీఆర్ఎస్' (దీ=నా) గా మార్చడం ద్వారా పార్టీ తన ఉనికిని, ప్రభావాన్ని పూర్తిగా కోల్పోయిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

**-ఉద్యమ త్యాగాలను స్మరిస్తూ..**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువత చేసిన అసమాన త్యాగాలను రామకోటి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నాటి విద్యావ్యవస్థలు స్తంభించి, యువత ఉపవాస దీక్షలతో రోడ్లపైకి వచ్చిన రోజులను ప్రస్తావించారు. యూనివర్సిటీల చుట్టూ ఇనుప కంచెలు వేసి, భారీ పోలీస్ బందోబస్తుతో ఆంక్షలు విధించినప్పటికీ... ఆ అడ్డంకులను ఛేదించుకుని జైళ్లకైనా సిద్ధమంటూ విద్యార్థులు పోరాడారని తెలిపారు. ఆనాడు యువత అంతా ప్రాణాలకు తెగించి పోరాడింది 'టీఆర్ఎస్' గులాబీ జెండా నీడలోనే అని ఆయన స్పష్టం చేశారు.

"బీఆర్ఎస్ అనే అస్తిత్వం లేని పేరుతో ముందుకు వెళ్లడం వల్ల నాటి ఉద్యమ త్యాగాలన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. ఇవాళ స్వార్థం కోసం పార్టీ పేరు మార్చిన వారు, రేపు రాష్ట్రం పేరు మార్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రజలు భావిస్తున్నారు."

**- అల్లంపల్లి రామకోటి**

**- కవిత నేతృత్వంలో పునర్జీవం**

టీఆర్ఎస్ పేరుకు పూర్వ వైభవం తెచ్చి, దానికి పునర్జీవం పోయడానికి కల్వకుంట్ల కవిత ముందుకు వస్తున్న తరుణంలో, ఉద్యమ శ్రేణులంతా ఆమె దారిలో నడిచి కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని రామకోటి పిలుపునిచ్చారు. అందరూ ఐకమత్యంతో 'టీఆర్ఎస్'కు మళ్లీ జీవం పోస్తేనే తెలంగాణ ప్రజల్లో సరికొత్త ఉత్సాహం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**- మార్పు లేకుంటే కాలగర్భంలోకే..**

కేసీఆర్ ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించాలని రామకోటి హితవు పలికారు. బీఆర్ఎస్ పార్టీని తిరిగి టీఆర్ఎస్ గా మార్చకపోతే రాబోయే రోజుల్లో కనీసం పోటీ చేసే పరిస్థితి కూడా ఉండదని హెచ్చరించారు. పేరు మార్చుకోకపోతే కేసీఆర్ రాజకీయ ఉనికి ప్రశ్నార్థకమవుతుందని, ఒక సాధారణ కార్యకర్త కంటే కింది స్థాయికి పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పేరు మార్చని పక్షంలో పార్టీ తిరిగి అధికారంలోకి రావడం అసాధ్యమని స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, అమరవీరుల త్యాగాలకు గౌరవం ఇవ్వడానికి తక్షణమే 'టీఆర్ఎస్' పేరును పునరుద్ధరించాలని రామకోటి డిమాండ్ చేశారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా
# రైతులు తమ పంటలు వేసుకోవాలి

**-పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**-గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(భారత శక్తి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు.

రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.



**- గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం**

అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**గ్రామసభకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.**

ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ జ్యోతిబాయి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy